ఎప్పుడు కొంటారో..!



ధాన్యంతో నిండిపోయిన ఆర్జాలబావి కొనుగోలు కేంద్రం



తిప్పర్తి మండలంలోని కంకణాలపల్లి గ్రామంలో ఐకేపీ కేంద్రంలో నిండిపోయిన ధాన్యం రాసులు

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోళ్లపై అధికారులు కాలయాపన చేస్తున్నారు. వరికోతలు మొదలు కావడానికి ముందే కొనుగోళ్లపైన కసరత్తు చేయాల్సిన అధికారులు ఇప్పటి వరకు మీనమేషాలు లెక్కించారు. జిల్లా వ్యాప్తంగా వేలాది మంది రైతులు తమ ధాన్యాన్ని కేంద్రాల్లో కుప్పలు పోసుకున్నారు. ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో వర్షం వస్తే తమ పరిస్థితిని తలచుకుని ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఎక్కువ ధాన్యం కొనుగోలు చేసే నల్గొండ సమీపంలోని ఆర్జాలబాయి కేంద్రంలో సోమవారం సాయంత్రం నాటికి వంద మందికిపైగా రైతులు ధాన్యం తీసుకొచ్చారు. వారం రోజుల నుంచి రైతులు తమ ధాన్యాన్ని ఇక్కడికి తరలిస్తూనే ఉన్నారు. ప్రస్తుతం ఈ కేంద్రంలో నాలుగు వేల క్వింటాళ్లకు పైగా ధాన్యం కుప్పలు పోసినట్లు నిర్వాహకులు తెలిపారు. వాస్తవానికి ఈ నెల 3వ తేదీన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తారని అధికారులు హడావుడి చేశారు. కానీ.. వర్షం వచ్చిందని కొనుగోళ్లు వాయిదా వేశారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బుధవారం కొనుగోళ్లు ప్రారంభిస్తామని సహకార అధికారులు తెలిపారు.

రైతేరాజు 8లో..

ప్రభుత్వ పథకాలు వేగవంతంగా అమలు: కలెక్టర్

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలను వేగవంతం చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. మొత్తం 56 మంది ఫిర్యాదులు సమర్పించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన జిల్లా అధికారుల సమ్మిళిత సమావేశంలో వివిధ అంశాలపై మాట్లాడారు. రైతులకు ఇబ్బంది లేకుండా పత్తిని కొనుగోలు చేయాలన్నారు. ఈ నెల 15లోగా జిల్లాలో 23 పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని సూచించారు. ప్రభుత్వం పొడవు పింజపత్తికి రూ.7521, మధ్యస్థ పింజ పత్తికి రూ.7121 మద్దతు ధర ప్రకటించిందని చెప్పారు.



గోడపత్రిక విడుదల చేస్తున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి


❒ వచ్చే ఏడాది నర్సరీల ద్వారా కోటి మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయా శాఖల ద్వారా నాటాల్సిన మొక్కల లక్ష్యాన్ని తెలిపారు.

❒ రెవెన్యూ, నీటి పారుదలశాఖల అధికారులు పహణి, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల ఆధారంగా సమన్వయంతో ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరించాలని చెప్పారు. పూర్తైన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆదేశించారు.

❒ మండల ప్రత్యేకాధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలపై దృష్టిసారించాలన్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ధాన్యం మద్దతు ధరపై రూపొందించిన గోడపత్రికను ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్లు టి.పూర్ణచంద్ర, జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రెండున్నరేళ్లలో ఎస్సెల్బీసీ, డిండి ఎత్తిపోతల పూర్తి చేస్తాం: మంత్రి

దేవరకొండ, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని నియోజకవర్గాలను సస్యశ్యామలం చేసేందుకు ఎస్సెల్బీసీ టన్నెల్ 9.5 కిలోమీటర్ల సొరంగ మార్గాన్ని డిసెంబర్ మాసంలో రెండు మిషన్ల ద్వారా పనులు ప్రారంభిస్తామని, డిండి ఎత్తిపోతల పథకాన్ని రెండున్నరేళ్లలో పూర్తి చేస్తామని రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం దేవరకొండ నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ఎన్నికైన నాయిని జమున, వైస్‌ఛైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం దేవరకొండ, నాగార్జునసాగర్ ఎమ్మెల్యేలు నేనావత్ బాలునాయక్, కుందూరు జైవీర్‌రెడ్డిల అధ్యక్షతన జరిగింది. మంత్రి వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నూతనంగా ఎన్నికైన వ్యవసాయ మార్కెట్ కమిటీ రైతులకు మేలు చేయడమే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. ఈ వారంలో రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున ఇవ్వనున్నామని, రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామని తెలిపారు. నల్గొండ జిల్లాకు ఆర్‌అండ్‌బీ ద్వారా రూ.516 కోట్లు కేటాయించామని, మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి బీటీ రోడ్లు వేస్తామని, మాల్, మర్రిగూడ గ్రామాల మీదుగా జిల్లాలో రూ.30 వేల కోట్లతో రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో శ్రీరాములు, పురపాలిక సంఘం ఛైర్మన్ ఆలంపల్లి నర్సింహ, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, దూదిపాల వేణుధర్‌రెడ్డి, ధనలక్ష్మి తదితరులున్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న పాలకవర్గం చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నేనావత్ బాలునాయక్, కుందూరు జైవీర్‌రెడ్డి

ఇక పాలు పొంగించడమే..!

★ ఉమ్మడి జిల్లాలో పంపిణీకి సిద్ధంగా ఉన్న ఇళ్లు 5,511

★ రెండు పడకగదుల ఇళ్ల కేటాయింపుపై ప్రభుత్వం కసరత్తు



నల్గొండలో పంపిణీకి సిద్ధంగా ఉన్న రెండు పడకగదుల సముదాయం

ఈనాడు, నల్గొండ: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్మాణం పూర్తి చేసుకొని ప్రస్తుతం వృథాగా ఉన్న రెండు పడకగదుల ఇళ్లను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఆవాసానికి సిద్ధంగా ఉన్న 5,511 ఇళ్లను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే ఈ నెలాఖరులోపు ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లను కేటాయిస్తామని ప్రకటించగా.. ఉమ్మడి జిల్లాలోని 11 నియోజకవర్గాలకు 38,500 ఇళ్లు, నాగార్జునసాగర్‌కు ప్రత్యేకంగా 5 వేల ఇళ్లు ఇస్తామని మంత్రి పొంగులేటి ఇటీవల నెల్లికల్ పర్యటన సందర్భంగా వెల్లడించారు.

★ రెండు పడకగదుల ఇళ్ల స్థితిగతులపై ఇప్పటికే అధికార యంత్రాంగం సమగ్ర నివేదికలను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించింది. ఈ నివేదికల ఆధారంగా సర్కారు ఓ నిర్ణయం తీసుకోనుంది. మరోవైపు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలో మొత్తం 17,199 ఇళ్లు మంజూరు చేయగా నాగార్జునసాగర్, ఆలేరుల్లో మినహాయించి ప్రతి నియోజకవర్గంలో ఈ పథకంలో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. మొత్తం 6,391 ఇళ్లు నిర్మాణం పూర్తి కాగా.. ఇందులో సూర్యాపేట నియోజకవర్గంలో మాత్రమే 880 ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. దేవరకొండ, నల్గొండ నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణం పూర్తయి మూడేళ్లయింది.

★ నల్గొండ పురపాలిక పరిధిలో 540 ఇళ్లను నిర్మించగా.. అవి లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడంతో అవి రోజురోజుకూ శిథిలావస్థకు చేరుతున్నాయి. యాదాద్రి జిల్లాలో 829 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా.. ఇప్పటి వరకు ఒక్క ఇంటినీ లబ్ధిదారులకు కేటాయించలేదు. సరైన సమయంలో బిల్లులు రాకపోవడం, గుత్తేదారులు పనులు చేయడానికి ఆసక్తి చూపకపోవడం తదితర కారణాలతో నకిరేకల్, మిర్యాలగూడ, తిప్పర్తి లాంటి ప్రాంతాల్లో నిర్మాణాలు 50, 60 శాతం పూర్తయి నిలిచిపోయాయి.

“సాధ్యమైనంత తొందరలో రెండు పడక గదుల ఇళ్లను లబ్ధిదారులకు అందించేందుకు కసరత్తు చేస్తున్నాం. అవసరమైతే దసరాలోపే ఇస్తాం. ఇందిరమ్మ ఇళ్లకు సైతం ఈ నెలాఖరులోపు అర్హులను ఎంపిక చేస్తాం.. ఇటీవల సమీక్ష సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేసిన ప్రకటన ఇది..



ఇందిరమ్మ కమిటీల ద్వారానే..

ప్రతి నియోజకవర్గానికి కేటాయించే 3500 ఇళ్లకు అర్హులను గ్రామాల్లోని ఇందిరమ్మ కమిటీల ద్వారానే ఎంపిక చేయాలని సర్కారు ఇప్పటికే నిర్ణయించింది. ఇందిరమ్మ కమిటీలను దసరాలోపు నియమిస్తారా? లేదా అనంతరమా? అన్నది తేలాల్సి ఉంది.

★ గతేడాది రెండు పడక గదుల ఇళ్లకు లబ్ధిదారులను డ్రా పద్ధతిలో కేటాయించగా... ఇప్పుడు వారికే అప్పగిస్తారా లేదా అన్నదీ ఇంకా సందిగ్ధంలోనే ఉంది. ఈ ఏడాది జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రజావాణిల్లోనూ ఎక్కువ దరఖాస్తులు ఇళ్లు కావాలనే వస్తుండటం గమనార్హం. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల్లోనూ ఇవే అత్యధికంగా ఉన్నాయి. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ దసరాలోపు ఓ నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమవుతుండటంతో అర్హుల్లో ఆశలు మొదలయ్యాయి.

గణాంకాలు

జిల్లా	మంజూరైన ఇళ్లు	పూర్తయినవి	50 శాతం కంటే ఎక్కువ నిర్మాణమైనవి	లబ్ధిదారులకు అందజేసినవి
నల్గొండ	8155	2476	3542	185
సూర్యాపేట	5424	3086	1986	695
యాదాద్రి	3620	829	1270	0

పాలక మండలి నియామకాలకు కసరత్తు

నల్గొండ కల్చరల్, న్యూస్‌టుడే: జిల్లాలోని 17 ఆలయాలకు పాలకమండలి నియామకం కోసం సోమవారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయక కమిషనర్ అన్నెపర్తి సులోచన ప్రకటన విడుదల చేశారు. చిట్యాలలోని శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం(శ్రీ శివాలయం), శ్రీబాల లక్ష్మీనర్సింహాస్వామి దేవాలయం, శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం (పేరపల్లి) శ్రీవేణుగోపాల స్వామి దేవాలయం (వట్టిమర్తి), శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం (గుండ్రాంపల్లి) దేవాలయాలున్నాయి.

■ కట్టంగూరు మండలంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం (ఈదులూరు), శ్రీలక్ష్మీనారాయణ స్వామి దేవాలయం (కట్టంగూరు), కేతేపల్లి మండలంలోని శ్రీశివ మహాదేవ దేవాలయం (కాసనగోడు), శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం (గుడివాడ), నకిరేకల్ మండలంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం (మంగలపల్లి), శ్రీ శంబులింగేశ్వరస్వామి దేవాలయం (చందుపట్ల), శ్రీలింగమంతుల స్వామి దేవాలయం (నెల్లిబండ), శ్రీ గోరక్షకస్వామి దేవాలయం (గోరెంకలపల్లి), శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం (నకిరేకల్) దేవాలయాలున్నట్లు ప్రకటించారు.

■ నార్కట్‌పల్లి మండలంలోని శ్రీ లక్ష్మీనరసింహాస్వామి దేవాలయం (శాపల్లి), శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం (యల్లారెడ్డి గూడెం), శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం (నార్కట్‌పల్లి) ఆలయాలు ఉన్నాయి. ఆసక్తి గల అభ్యర్థులు ఆయా దేవాలయాలకు ప్రకటన వెలువడిన నాటి నుంచి 20 రోజుల్లోగా దరఖాస్తులను జిల్లా కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలని ధర్నా

నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు సుధాకర్ మాట్లాడారు. కార్మికులకు పండగ పూట పస్తులతో ఉంచకుండా పెండింగ్ వేతనాలు అందచేయాలన్నారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు అనేక సేవలు చేస్తున్న పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేస్తూ ప్రతి నెల మొదటి తేదీన వేతనం చెల్లించాలని కోరారు. అర్హత కలిగిన వారిని క్రమబద్ధీకరించాలన్నారు. ప్రమాద బీమా రూ.10 లక్షలు చెల్లించాలన్నారు. ధర్నాలో యూనియన్ నాయకులు సీహెచ్. లక్ష్మీనారాయణ, పోలె సత్యనారాయణ, పి.వినోద్, సైదులు, మంగారెడ్డి, లింగయ్య, సర్వయ్య, నరసయ్య, జానయ్య, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

నియంత్రికల మరమ్మతుల్లో మాయాజాలం



విద్యుత్తు మరమ్మతుల కేంద్రం ఎదుట కాలిపోయిన నియంత్రికలు

పరిశీలన

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: నల్గొండ జిల్లాలో విద్యుత్తు నియంత్రికలు పెద్దమొత్తంలో కాలిపోతున్నాయి. వానాకాలంలోనూ పెద్ద సంఖ్యలో మరమ్మతులకు గురవుతున్నాయి. వాటిని బాగు చేసి తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు విద్యుత్తు అధికారులు, సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. మరమ్మతుల పేర విద్యుత్తు సంస్థపై ఏటా రూ.కోట్లల్లో భారం పడుతుండగా.. మరో వైపు రైతుల నుంచి కూడా అక్రమంగా వసూళ్లు చేస్తూ మాయాజాలం ప్రదర్శిస్తున్నారు.

❒ జిల్లాలో దాదాపు 8 లక్షలకు పైగా వివిధ రకాల విద్యుత్తు సర్వీసులున్నాయి. వాటికి 78500 నియంత్రికల ద్వారా విద్యుత్తు సరఫరా చేస్తున్నారు. అందులో గత జూన్ నుంచి ఇప్పటి వరకు ఆ సంస్థ లెక్కల ప్రకారం ప్రతి రోజు 25 నుంచి 40 వరకు నియంత్రికలు కాలిపోతున్నాయి. వీటి బాగు చేయడానికి జిల్లాలో 11 ప్రాంతాల్లో మరమ్మతుల(ఎస్పీఎం) కేంద్రాలు ఏర్పాటు చేశారు. చెడిపోయిన వాటిని ఇంజినీర్ల పర్యవేక్షణలో పరిశీలించి మరమ్మతులు చేయాలి. కానీ.. జిల్లాలో ఎక్కడా అది అమలు కావడం లేదు. కేంద్రాల నిర్వాహకులతో అధికారులు కుమ్మక్కు కావడంతో ఎంత బిల్లు రాస్తే అంత మొత్తం చెల్లిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అధికారులతో గుత్తేదారు సంస్థలు కుమ్మక్కై కొన్ని కేంద్రాల్లో పాక్షికంగా చెడిపోయిన వాటిని కూడా పూర్తిగా మరమ్మతులు చేసినట్లు బిల్లులు డ్రా చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

రూ.5.5 కోట్ల భారం

ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు రోజుకు పదిలోపు ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోగా.. జూన్ నుంచి సెప్టెంబరు వరకు ఆ సంఖ్య రెండుమూడు రెట్లు పెరిగింది. జూన్‌లోనే 1114 కాలిపోయినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఒక్కో నియంత్రిక మరమ్మతుల కోసం ఆ సంస్థ రూ.5 వేల నుంచి రూ.25వేల వరకు గుత్తేదారులకు చెల్లిస్తోంది. సగటున రూ.10వేల చొప్పున లెక్కిస్తే 5484 నియంత్రికల మరమ్మతులకు సుమారు రూ.5.5 కోట్ల వరకు విద్యుత్తు సంస్థపై ఆర్థిక భారం పడింది. వీటి మరమ్మతుల్లో నాణ్యతాప్రమాణాలు పాటిస్తే కాలిపోయే వాటి సంఖ్య తగ్గే అవకాశం ఉంది. ఇక ప్రభుత్వం అవసరమైనంత మేరకు నిధులు మంజూరు చేస్తున్నా.. నియంత్రికల మరమ్మతులకు రైతుల నుంచి అక్రమంగా డబ్బులు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

నెల వారీగా వివరాలు

నెల	కాలిపోయిన నియంత్రికల సంఖ్య
జనవరి	239
ఫిబ్రవరి	330
మార్చి	242
ఏప్రిల్	248
మే	721
జూన్	1114
జులై	989
ఆగస్టు	757
సెప్టెంబరు	790
మొత్తం	5484

అధికారుల పర్యవేక్షణలోనే..

మురళీ కృష్ణ ఏడీఈ, విద్యుత్తు సంస్థ, నల్గొండ

నియంత్రికల మరమ్మతుల్లో ఎలాంటి అవినీతి చోటు చేసుకోవడం లేదు. అధికారుల పర్యవేక్షణలోనే బాగు చేయిస్తున్నాం. నియంత్రిక రాగానే స్థానిక ఇంజినీరు పరిశీలించి అందులో చెడిపోయిన భాగాలను గుర్తించి మరమ్మతులకు ఆదేశిస్తారు. బాగు చేశాక మరో సారి పరిశీలిస్తారు. వానా కాలంలో ఉరుములు, మెరుపులు, గాలి, వానలతో విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గుల వల్ల ఎక్కువగా కాలిపోతున్నాయి. రైతులకు ఇబ్బందులు లేకుండా తిరిగి అందిస్తున్నాం. మరమ్మతులకు రైతుల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తే చర్యలు తీసుకుంటాం.

ధాన్యం ఉందా.. ధనమై పోయిందా..!



హుజూర్‌నగర్: ఓ మిల్లులో ఉన్న సీఎంఆర్ ధాన్యం

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే:

కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) బకాయి ఉన్న మిల్లుల్లో అధికారుల తనిఖీ మొదలయ్యాయి. వారు ఇవ్వాల్సిన సీఎంఆర్ బియ్యానికి సరిపడా మిల్లుల్లో ధాన్యం ఉందా, లేదా అన్న విషయంపై అధికారులతో తనిఖీ చేయించేందుకు ఎఫ్‌సీఐ నిర్ణయించింది. ఈ నెల పదిలోగా లెక్కలు తేల్చాలని ఎఫ్‌సీఐ నిర్ణయించి తనిఖీలు ప్రారంభించింది. ఈ మేరకు ఈ నెల 5న ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేసేందుకు ఏడుగురు ప్రత్యేక అధికారులను నియమించి వారి ద్వారా ఆయా మిల్లుల్లో ధాన్యం నిల్వల లెక్కలు తేల్చనున్నారు. లెక్కలు తేలిన తరువాతే సీఎంఆర్ బియ్యం సేకరణలు తిరిగి ప్రారంభించాలని ప్రాథమికంగా ఎఫ్‌సీఐ నిర్ణయించింది.

★ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏడుగురు అధికారులను నియమించారు. చిట్యాల, నకిరేకల్‌కు ఒకరిని, నల్గొండ, దేవరకొండకు మరొకరిని నియమించారు. హాలియా, మిర్యాలగూడ కేంద్రాలకు ఒకరిని, హుజూర్‌నగర్, నేరేడుచర్ల కేంద్రాలకు ఒక అధికారిని నియమించారు. కోదాడకు ప్రత్యేకంగా ఒకరిని నియమించారు. సూర్యాపేట, తిరుమలగిరి కేంద్రాలకు ఒక అధికారిని, యాదాద్రి, భువనగిరి ప్రాంతాలకు ఒకరిని నియమించారు. ఈ ఏడుగురు అధికారుల ఆధ్వర్యంలో సీఎంఆర్ బకాయిలు ఉన్న మిల్లుల్లో

❒ సీఎంఆర్ బియ్యం పెట్టని మిల్లుల్లో తనిఖీలు

తనిఖీలు నిర్వహించి రావాల్సిన బియ్యానికి సంబంధించి అసలు ధాన్యం ఉందా లేదా అన్న విషయంపై యుద్ధ ప్రాతిపదికన నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

2023-24 వానాకాలం, యాసంగి సీఎంఆర్ వసూలు వివరాలు 21-09-2024 నాటికి (మె.టన్నుల్లో)

జిల్లా	వసూలైన బియ్యం	బకాయిలు
వానాకాలం:		
నల్గొండ	1,89,215	28,361
సూర్యాపేట	75,590	64,564
యాదాద్రి	1,38,848	40,039
యాసంగి:		
నల్గొండ	1,39,613	82,113
సూర్యాపేట	40,604	1,22,989
యాదాద్రి	68,721	1,15,333

చర్యలు తీసుకునే అవకాశం..

ఎన్ని సార్లు గడువు పెంచినా మిల్లర్లు సీఎంఆర్ బకాయిలు ఇవ్వడం లేదు. ఇప్పటికే కొంత మంది మిల్లర్లు ఉన్న ధాన్యం అమ్ముకొని దాటవేత ధోరణితో ఉన్నారని అధికారులు గుర్తించారు. సీఎంఆర్ ధాన్యం మిల్లుల్లో ఏ స్థాయిలో ఉందో తనిఖీలలో ఈసారి కచ్చితంగా లెక్కలు తేలుతాయన్న నమ్మకంతో అధికారులు ఉన్నారు. గతంలోనూ మిల్లుల్లో లెక్కలు తేల్చాలని నిర్ణయించినా తమ మిల్లుల్లో ధాన్యం లెక్కించే విధంగా లేదని, రకరకాల కారణాలు చెప్పి దాటవేశారు. ఈసారి అలా జరగకుండా ఎలా ఉన్నా ధాన్యాన్ని అధికారులు లెక్కించి ఒక నిర్ణయానికి రావాలని ఆదేశించినట్లు సమాచారం. ఈసారి మిల్లుల్లో ధాన్యం లేని మిల్లర్లపై చర్యలు తీసుకునే అవకాశం కూడా ఉందని అధికార వర్గాలు అంటున్నాయి.

9న నిరుద్యోగులకు ఉద్యోగ మేళా

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు, విదేశీ ఉద్యోగ నమోదుకు ఈ నెల 9న ఉద్యోగ మేళా ఏర్పాటు చేసినట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎన్ పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం ఐటీఐ క్యాంపస్ లో నిర్వహించే ఈ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాగులో సాంకేతిక సాయం

రైతేరాజు



త్రిపురారం మండలం బాబుసాయిపేటలో డ్రోన్‌తో మందులు పిచికారీ చేయిస్తున్న రైతు

త్రిపురారం, న్యూస్‌టుడే: వ్యవసాయంలో యాంత్రీకరణ రోజురోజుకు పెరుగుతుంది. అందులో కూలీల కొరత, వారికున్న డిమాండ్, ఖర్చులు విపరీతంగా పెరుగుతుండడంతో గమనించిన నల్గొండ జిల్లా త్రిపురారం మండలం బాబుసాయిపేట గ్రామానికి చెందిన గోపగాని హరిప్రసాద్, శివనారాయణలు రూ.5.20 లక్షల వ్యయంతో బ్యాటరీతో నడిచే డ్రోన్‌ను కొనుగోలు చేసి పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు. డ్రోన్‌తో ఎకరం పొలంలో 5 నుంచి 10 నిమిషాలలోపు మందులను పిచికారీ చేయవచ్చు. దీని వల్ల రైతులకు సమయం ఆదాతో పాటు, ఖర్చులు తగ్గుతాయి. దీంతో పరిసర గ్రామాల రైతులు డ్రోన్ ద్వారా పురుగు మందులు, ఎరువులు చల్లడానికి ఆసక్తి కనబర్చుతున్నారు. కంపసాగర్ కేవీకే వారు సైతం రైతులు ముందుగా సమాచారం ఇస్తే డ్రోన్ల ద్వారా పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు.

ఖర్చు తగ్గుతుంది

- గోపగాని చిననర్సయ్య, త్రిపురారం



ప్రస్తుతం ట్రాక్టర్ సాయంతో పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు. దీని వల్ల ఎకరాకు రూ.800 వరకు ఖర్చు కాగా యంత్రంతో రూ.400 నుంచి రూ.500 తోనే అయిపోతుంది. ఈ విధానం వల్ల మందు వృథా కాదు. కూలీల కొరతను అధిగమించవచ్చు.

ఎత్తు మడుల పద్ధతిలో వేరుసెనగ

గరిడేపల్లి, న్యూస్‌టుడే: వేరుసెనగ సాగుచేసే రైతులు ఎత్తుమడుల పద్ధతిలో విత్తుకోవచ్చని కేవీకే శాస్త్రవేత్త అరిగేల కిరణ్ సూచించారు. వేరుసెనగను విత్తుకోవడానికి ఇదే సరైన సమయం. నవంబరు పక్షం వరకు వేసుకోవచ్చు. కాండం కుళ్లు తెగులు ఆశించకుండా ముందస్తుగా విత్తనశుద్ధి చేసుకోవాలి. కొత్తగా సాగుచేసే రైతులు ఎకరానికి సరిపడా విత్తనానికి 250 గ్రాముల రైజోబియం అనే జీవన ఎరువుతో విత్తన శుద్ధిచేయాలి. కొత్తగా ఎత్తు మడుల పద్ధతిలో విత్తుకుంటే కాయలు ఎక్కువగా వచ్చి అధిక దిగుబడులు సాధించవచ్చు. 120 సెం.మీ. ఎడంగల 15 సెం.మీ. ఎత్తుమడులు 30 సెం.మీ. ఉండే కాల్వలు ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి మడి మీద 30 సెం.మీ. దూరంలో నాలుగు వరుసల్లో వేరుసెనగ విత్తుకోవాలి. లేదంటే ట్రాక్టర్‌తో నడిచే బ్రాడ్ బెడ్ ప్లాంటర్‌తో విత్తుకోవచ్చు.



సౌరశక్తితో.. సర్వ ప్రయోజనాలు

చందంపేట, న్యూస్‌టుడే: పంటలను కాపాడుకునేందుకు రైతులు విభిన్న ప్రయత్నాలు చేస్తున్నా.. చివరికి దిగుబడి మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. ఈ క్రమంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొందేందుకు కొందరు రైతులు సాంకేతిక పరికరాలను ఉపయోగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. బుడ్డోనితండాకు చెందిన రైతు బాలు ఇటీవల నల్గొండ నాగార్జున డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రదర్శనకు హాజరయ్యాడు. పత్తి పంటలకు సోకే తెల్ల, పచ్చదోమ, వివిధ రకాల పురుగుల నుంచి కాపాడుకునేందుకు రూ. 4500 వ్యయంతో సోలార్ ట్రాప్‌ను కొనుగోలు చేశాడు. ఈ పరికరం రెండెకరాల వరకు పంటను నాశనం చేసే పురుగులను నివారిస్తుందని తెలిపారు. హాని చేసే పురుగులు సాయంత్రం 8 నుంచి 12 గంటల వరకు, ఉదయం 6 నుంచి 7 గంటల వరకు సంచరిస్తాయి. ఆ సమయంలో సోలార్ ట్రాప్‌కు అమర్చిన గిన్నెలో వెలుతురుకు పురుగులు వచ్చి అందులో పడి చనిపోతాయి. మిగతా సమయంలో సోలార్ ట్రాప్ వెలుగులు దానంతట అవే ఆగిపోతాయి. ఈ పరికరంతో పంటకు పిచికారీ చేసే అవకాశం కొద్దిగా తగ్గుతుందని రైతు పేర్కొన్నారు.



బుడ్డోనితండా సమీపంలో పొలంలో ఏర్పాటు చేసిన సోలార్ ట్రాప్

పత్తిలో పూత, కాయ రాలడం నివారణ

త్రిపురారం: పత్తిలో అధిక వర్షాల కారణంగా పూత, కాయ రాలడం దాని నివారణపై కంపసాగర్ కేవీకే పీసీ శ్రీనివాస్‌రావు తెలియజేశారు. పత్తిలో ప్రతికూల పరిస్థితుల వల్ల మొక్కల జీవన ప్రక్రియలో మార్పు వల్ల, అధిక వర్షాల వల్ల పూత, పిందె రాలడం జరుగుతుంది. అధిగమించడానికి నాఫ్తలిన్, ఎసిటిక్ యాసిడ్ 10 పీపీఎమ్ ద్రావణాన్ని విడిగా, 1 మి.లీ. ప్లైఅమ్మోనియం ఫాస్ఫేట్ ద్రావణంతో కలిపి ఒకటి, రెండు సార్లు 10, 15 రోజుల వ్యవధిలో అవసరాన్ని బట్టి పిచికారీ చేయాలి. సైకోసిల్ 60 పీపీఎమ్ పిచికారీ చేయడం ద్వారా కూడా పూత, పిందె రాలడాన్ని అధిగమించవచ్చు. కాయ కుళ్లు తెగులు లక్షణాలు కాయలపై పెద్ద వ్యాప్తి చెందిన మచ్చలు ఏర్పడతాయి. మచ్చల మధ్యలో గులాబీ రంగులో ఉండే స్పోర్‌మాస్ ఉంటుంది. పత్తి మొక్క అన్ని భాగాలను, పెరుగుదల యొక్క ఏదైనా దశలోనైనా ఈ వ్యాధి సంక్రమిస్తుంది. వ్యాధి ఎక్కువగా ఉన్నప్పుడు కాయలు కుళ్లి పోతాయి. దీని నివారణకు స్ట్రెప్టోసైక్లిన్ 1 మి.లీ., కాపర్ ఆక్సీక్లోరైడ్ మందులను 30 గ్రా. 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.



సమస్య - సమాధానం

? యాసంగిలో వేరుసెనగ విత్తే సమయం తెలపగలరు. **-కృష్ణయ్య, నల్గొండ**

సమాధానం: తెలంగాణ ప్రాంతంలో సెప్టెంబరు మొదటి పక్షం నుంచి నవంబరు 30 వరకు విత్తుకోవచ్చు. అనుకూలమైన విత్తే రకాలు కదిరి- 6, 9 అనంత, ధరణి టీవీజీ-24, జేఎల్- 24, జేసీసీ-110 వేరుసెనగను అక్టోబరు 15 లోపు విత్తడం ద్వారా పురుగుల, చీడ పీడల ఉధృతి నివారించవచ్చు.

? ఆయిల్ పామ్‌లో కొమ్ము పురుగు లక్షణాలు, నివారణ చర్యలు తెలపండి. **-బాలునాయక్, దేవరకొండ**

సమాధానం: ఆకుల చివర ఏ ఆకారంలో ఖాళీలు ఏర్పడతాయి. ఆకుల మొదళ్ల మీద శాశ్వత రంధ్రాలు ఏర్పడి వాటి నుంచి పిప్పి బయటకు కనిపిస్తుంది. నివారణకు పునరుత్పత్తి ప్రదేశాలను నాశనం చేయాలి. సూది మొనగల ఇనుప ఊచను మొవ్వ వద్ద కన్నంలో దూర్చి లోపల పెంకు పురుగులను బయటకు తీసి చంపాలి. పులిసిన ఆముదపు పిండి, లింగాకర్షక ఎరల ద్వారా పెద్ద పురుగులను పట్టి చంపవచ్చు.

? యాసంగిలో అనువైన వరి రకాలు, విత్తే సమయం గురించి తెలపగలరు. **-శ్రీనివాస్‌రెడ్డి, తిప్పర్తి**

సమాధానం: డిసెంబరు నుంచి ఏప్రిల్ వరకు వరి పంటను రైతాంగం సాగు చేస్తుంటారు. యాసంగిలో అనువైన రకాలు శోభిని ఆర్ఎన్ఆర్-2354, రాజేంద్ర ఆర్ఎన్ఆర్-12329, జేజీఎల్- 1118, ఎర్రమల్లెలు, డబ్ల్యూజీఎల్-20471. జనవరి మొదటి వారంలో నాట్లను వేసుకోవాలి.

త్రిపురారం, న్యూస్‌టుడే:

రైతులు వాట్సప్ ద్వారా అడిగే సమస్యలకు, సందేహాలకు కంపసాగర్ కేవీకే ఉద్యాన విభాగం శాస్త్రవేత్త శ్రీనివాసరావు సమాధానాలు ఇస్తారు. ఫోన్ నంబర్: 77025 44771



కంపసాగర్ కేవీకే పీసీ శ్రీనివాసరావు

బడిపిల్లలే భూసారథులు



భూసార పరీక్ష కిట్ గురించి వివరిస్తున్న వ్యవసాయాధికారులు

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే:

సాగులో విచ్చలవిడిగా రసాయన ఎరువులు వాడటంతో భూసారం దెబ్బతింటోంది. దీనిపై అన్నదాతలకు అవగాహన కల్పిస్తే జరుగుతున్న నష్టాన్ని నివారించవచ్చు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఎక్కువ శాతం రైతు కుటుంబాల నుంచి వచ్చినవారే. వారికి నేల ఆరోగ్యం, పంటల సాగు, రసాయన ఎరువుల వినియోగంపై అవగాహన కల్పిస్తే.. వారి ద్వారా రైతు కుటుంబాలకు మేలు జరుగుతుంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం తొలిసారిగా ఈ విద్యా సంవత్సరంలో స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాం ప్రాజెక్టును చేపట్టింది. దేశవ్యాప్తంగా వెయ్యి పాఠశాలలను ఎంపిక చేసింది. ఇందులో నల్గొండ జిల్లాలో రెండు, యాదాద్రి భువనగిరి జిల్లాలో ఒక పాఠశాలలో ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. పాఠాలు వినే బడి పిల్లలే స్వయంగా రైతు భూముల నుంచి మట్టి నమూనాలు సేకరిస్తున్నారు. వాటి ఫలితాలను రైతులకు అందజేస్తారు. ఏ ఎరువు, ఎంత మోతాదులో వేయాలో వ్యవసాయాధికారులు వారికి శిక్షణ ఇస్తారు.

భూసార పరీక్షలపై విద్యార్థులకు పాఠాలు..

ప్రాజెక్టు కోసం ఎంపిక చేసిన పాఠశాలల్లో ఆసక్తి ఉన్న విద్యార్థుల పేర్లతో ప్రత్యేకంగా పోర్టల్ ఏర్పాటు చేసుకొని అందులో నమోదు చేయాలి. మట్టి నమూనాల సేకరణ, రికార్డుల నిర్వహణ, ఫలితాల విశ్లేషణ, ఫలితాలను ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుంది. 7, 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థుల్లో 50 మందిని ఎంపిక చేసుకొని, నాలుగైదు బృందాలుగా ఏర్పాటు చేసుకోవాలి. మట్టి నమూనాల సేకరణ, ఫలితాల విశ్లేషణ, తదితర వాటి గురించి విద్యార్థులకు స్థానిక భూసార పరీక్ష కేంద్రం అధికారులు శిక్షణ ఇస్తారు. మట్టి నమూనాల సేకరణ నుంచి ఫలితాల వరకు విద్యార్థులు స్వయంగా పని చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే ఆయా పాఠశాలల్లో శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేశారు. ఎంపిక చేసిన పాఠశాలలకు ప్రభుత్వం భూసార పరీక్ష కిట్లను సరఫరా చేసింది. పాఠశాలకు దగ్గరలో ఉండే పంట పొలాల నుంచి వానాకాలం, యాసంగి కలిపి 50 నమూనాలు సేకరించి, వాటిని పరీక్షించి, ఫలితాలు రైతులకు అందించాల్సి ఉంటుంది.

ఎంపిక చేసిన పాఠశాలలు ఇవే..

నల్గొండ జిల్లాలో స్థానిక కేంద్రీయ విద్యాలయంతో పాటు చండూరు జవహర్ నవోదయ విద్యాలయాలను ఎంపిక చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో రాయగిరి జడ్పీ ఉన్నత పాఠశాలను ఎంపిక చేయగా.. సూర్యాపేట జిల్లాలో భూసార పరీక్ష కేంద్రం లేకపోవడంతో పాఠశాలలను ఎంపిక చేయలేదు.

రైతులకు ఉపయోగం..

లోహిత, కేంద్రీయ విద్యాలయం, నల్గొండ



భూసార పరీక్షల ద్వారా రైతులకు ప్రయోజనం ఉంటుంది. ఈ పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వేస్తే ఖర్చు తగ్గుతుంది. అనవసరంగా ఎరువులు వేయడం తప్పుతుంది. అధిక దిగుబడులు సాధించవచ్చు. దీనిపై రైతులను చైతన్యం చేస్తాం.


ఎప్పటికప్పుడు సందేహాల నివృత్తి

పాల్వాయి శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, నల్గొండ

ప్రాజెక్టులో భాగంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో మట్టి నమూనాల సేకరణ, ఫలితాల విశ్లేషణ తదితర వాటిపై శిక్షణ ఇచ్చాం. పాఠశాలల వారీగా కిట్లు సరఫరా చేశాం. విద్యార్థులకు సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నాం.

భారాస నాయకులు నివాసం ఉంటే తెలుస్తుంది: మంత్రి

దేవరకొండ, న్యూస్‌టుడే: అసెంబ్లీ సమావేశాలకు రాని కేసీఆర్, ఆ పార్టీ ఎమ్మెల్యేలు ప్రతిపక్ష హోదాలో బాధ్యతగా వ్యవహరిస్తున్నారా.. అని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. నల్గొండ జిల్లా దేవరకొండ పురపాలికలోని స్థానిక ఫంక్షన్‌హాల్‌లో సోమవారం మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2014లో ప్రస్తుత ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌ను ఓడించేందుకు దేవరకొండకు వచ్చిన కేసీఆర్ నక్కలగండి ప్రాజెక్టును కుర్చీ వేసుకొని పూర్తి చేస్తానని చెప్పి, నేడు ఫాంహౌజ్ నుంచి బయటకు రావడం లేదని ఆరోపించారు. మూసీ వల్ల అనేక మంది రోగాల బారిన పడుతున్నారని.. వారిని రక్షించేందుకు తమ ప్రభుత్వం మూసీ ప్రక్షాళనకు చర్యలు చేపడుతుంటే హరీశ్‌రావు, కేటీఆర్‌లు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. భారాస నాయకులు అక్కడ నివాసం ఉంటే అక్కడి కష్టాలు తెలుస్తాయన్నారు. దేవరకొండ, నాగార్జునసాగర్ ఎమ్మెల్యేలు నేనావత్ బాలునాయక్, కుందూరు జైవీర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, పురపాలిక సంఘం ఛైర్మన్ ఆలంపల్లి నర్సింహ, జూలూరు ధనలక్ష్మి, ప్రతాప్‌రెడ్డి తదితరులున్నారు.



దేవరకొండలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు జైవీర్ రెడ్డి, బాలు నాయక్, తదితరులు

నార్ముల్ డెయిరీకి పూర్వవైభవం తెస్తాం..

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హయత్‌నగర్, న్యూస్‌టుడే: నల్గొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార యూనియన్ (నార్ముల్ డెయిరీ)కు పూర్వవైభవం తెచ్చేందుకు శతవిధాలుగా కృషిచేస్తానని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. హయత్‌నగర్‌లోని డెయిరీ కార్యాలయంలో నూతన ఛైర్మన్‌గా ఎన్నికైన గుడిపాటి మధుసూదన్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అభినందన సభకు ముఖ్య అతిథులుగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ పండుగల జయశ్రీ, డీసీసీ ఛైర్మన్ సంజీవరెడ్డి తదితరులు హాజరయ్యారు. మంత్రి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. డెయిరీని లాభాలబాట పట్టించేందుకు అన్నిరకాల చర్యలు చేపడతామన్నారు. . ఉమ్మడి నల్గొండ, రంగారెడ్డి జిల్లాలో విజయ డెయిరీకి బదులుగా ప్రభుత్వ ఆస్పత్రులు, వసతిగృహాలు, ఆలయాల్లో నార్ముల్ డెయిరీ పాలు, నెయ్యి వినియోగించేలా చూస్తామన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న మధుసూదన్‌రెడ్డి, చిత్రంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మంత్రి వెంకట్‌రెడ్డి

అట్టహాసంగా అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ అథ్లెటిక్స్ సంఘం సహకారంతో హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో 10వ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజులపాటు జరిగే పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి అథ్లెట్లు హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేషీ, స్పోర్ట్స్ ఓఎస్‌డీ రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొదట రాష్ట్రస్థాయి పోటీలు హైదరాబాద్‌లో నిర్వహిస్తే బాగుండు అనుకున్నా.. కానీ! ఇక్కడి జేఎన్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ చూసిన తర్వాత సంతోషం కలిగిందన్నారు. రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం ఛైర్మన్ వరద రాజేశ్వరరావు మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు దీటుగా ఓరుగల్లులో క్రీడాకారులకు మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. జేఎన్ స్టేడియంలో మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తానని హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి అశోక్‌కుమార్ తెలిపారు. గత నెలలో చెన్నైలో జరిగిన సౌత్ ఏషియన్స్ అథ్లెటిక్స్ ఫెడరేషన్(ఎస్ఏఏఎఫ్) గేమ్స్‌లో వరంగల్ జిల్లా నెక్కొండకు చెందిన వినోద్‌కుమార్ 800 మీటర్ల పరుగులో కాంస్యం, గచ్చిబౌలి అకాడమీకి చెందిన మోహిత్‌చౌదరి 3000 మీటర్ల పరుగులో కాంస్య పతకాలు సాధించారు. వారిని రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో సత్కరించి నగదు బహూకరించారు. అనంతరం వివిధ విభాగాల్లో గెలుపొందిన అథ్లెట్లకు అతిథులు వ్యక్తిగత మెడల్స్ అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి, నిర్వహణ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, కోచ్‌లు శ్రీమాన్, నాగరాజు, పీడీలు సాంబమూర్తి, మహేందర్, కృష్ణ, రజినీకాంత్, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.



తుపాకీ పేల్చి అండర్-20 బాలుర 800 మీటర్ల పరుగు ప్రారంభిస్తున్న రవీందర్‌రెడ్డి

చికెన్ ధరలు

ఫాంరేటు	114-00
రిటైల్	136-00
డ్రెస్డ్	197-00
స్కిన్‌లెస్	224-00

పట్టు పురుగుల పెంపకంతో అధిక లాభాలు

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: పట్టు పురుగుల పెంపకంతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్ర నిపుణురాలు డా. టి. మాధురి తెలిపారు. సోమవారం మండలంలోని దేశ్‌ముఖోనికుంట గ్రామంలో రైతు చేపూరి ప్రమోద్ గౌతమ్ సాగు చేస్తున్న మల్బరీ తోటను సందర్శించారు. రైతులకు మల్బరితోట సాగు, పట్టుపురుగుల పెంపకంలో పలు సలహాలు, సూచనలు చేశారు. చిన్న, సన్నకారు రైతులు పట్టు పురుగుల పెంపకం వల్ల నెలకు సుమారు రూ.50 వేల వరకు ఆదాయం పొందవచ్చని తెలిపారు. మల్బరీ తోటలు సాగు చేసే రైతులకు సెంట్రల్ సిల్క్ బోర్డు రాయితీ అందిస్తుందని వివరించారు. రైతులు సంజీవకుమార్, ప్రమోద్‌గౌతమ్, భువనేశ్వరి, కిషోర్‌కుమార్ తదితరులున్నారు.

వివాహిత బలవన్మరణం

అడవిదేవులపల్లి, న్యూస్‌టుడే: అనారోగ్య కారణాలు, మానసిక వేదనతో వివాహిత బలవన్మరణానికి పాల్పడిన ఘటన సోమవారం తెల్లవారుజామున అడవిదేవులపల్లి మండలం మొల్కచర్ల గ్రామపంచాయతీ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీతండాకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ రమావత్ తులసీరాం భార్య వాలి(27) గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. తన కోసం కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడకూడదని తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వాలిని కిందకు దించగా అప్పటికే మృతిచెందింది. వాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. వాలి మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించి మరణోత్తర పరీక్షల అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి తండ్రి వస్రాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్యూషన్లు చెబుతూ... చోరీలు చేస్తూ..

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: మహిళల గొలుసులు దొంగతనం చేసిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం ఇబ్రహీంపట్నం ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ రాజు, సీఐ సత్యనారాయణ, ఎస్ఐ నాగరాజుతో కలిసి దొంగతనం వివరాలను వెల్లడించారు. నల్గొండ జిల్లా వద్దిపట్ల గ్రామానికి చెందిన బొంత అనీల్.. నగరంలోని శాలిబండలో నివాసం ఉంటున్నాడు. స్కూల్, కళాశాల విద్యార్థులకు ట్యూషన్లు చెబుతుంటాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడ్డాడు. అప్పులు చేసి వాటిని తీర్చడానికి దొంగతనాలు చేస్తున్నాడు. గత నెల 17 పహడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అవుటర్ సర్వీసురోడ్డు వద్ద ఓ మహిళ మెడలో 4 తులాల బంగారు గొలుసు, ఈనెల 4న ఇబ్రహీంపట్నం సమీపంలోని శేరిగూడ గ్రామానికి చెందిన మొద్దు భారతమ్మ మెడలోని 3 తులాల బంగారు గొలుసు చోరీ చేశారు. ఎస్ఐ నాగరాజు, క్రైం పోలీసులు నిందితుడు అనీల్‌ను గుర్తించి 7 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్‌కు తరలించారు.

ప్రకృతి ప్రేమికులు.. వ్యవసాయ శ్రామికులు

ప్రకృతి సాగు చేస్తూ, పంట మార్పిడి విధానంతో అధిక దిగుబడులు సాధిస్తున్నారు. పండించిన పంటలను ఇతర రాష్ట్రాలకు పంపిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు నడిగూడెం మండలానికి చెందిన నాగిరెడ్డి వెంకటరెడ్డి, ఏలేటి వెంకటేశ్వరరెడ్డి, రామారావు. - నడిగూడెం, న్యూస్‌టుడే:

గో ఆధారిత సాగు..

నారాయణపురం గ్రామానికి చెందిన **నాగిరెడ్డి వెంకటరెడ్డి** తనకున్న నాలుగెకరాల్లో ఐదేళ్లుగా ప్రకృతి సాగు చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ ప్రేమికుడు సుభాష్ పాలేకర్ వద్ద రెండుసార్లు శిక్షణ పొందారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులు ఉపయోగించకుండా గోఆధారిత సాగు చేపట్టారు. వరి, వేరుసెనగ, కంది, పెసర, పసుపు, ఉలవ, ఉల్లి పంటలతో పాటు కూరగాయలు, ఆకుకూరలను సహజసిద్ధంగా పండిస్తున్నారు. - భూసారం పెంపొందించేందుకు తృణధాన్యాలు సాగు చేస్తున్నారు. విత్తనాభివృద్ధికి దేశీ వరి రకాలను సాగు చేస్తూ, ఇతర రైతులకు విత్తనాలు విక్రయిస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారు. పంటల్లో చీడపీడల నివారణకు జీవామృతం, నీమాస్త్రం, అగ్నిహస్త్రం, దశపర్ణి, వేప కషాయం, బీజామృతం, మట్టి ద్రావణాలు సిద్ధం చేసుకొని భూసారాన్ని పెంపొందించుకుంటున్నారు. ప్రకృతి సాగులో దిగుబడి తక్కువగా ఉన్నా, మార్కెట్‌లో రెట్టింపు ధర లభిస్తుండటంతో గిట్టుబాటు అవుతుందన్నారు.



కషాయాలు తయారు చేసి..

సేంద్రియ సాగుపై ఆసక్తి, మందుల్లేని ఆహారం తీసుకోవాలనే సంకల్పంతో తమకున్న ఎకరం విస్తీర్ణంలో సేంద్రియ పద్ధతిలో వరిసాగు చేపట్టారు రత్నవరం గ్రామానికి చెందిన **రామారావు.** గత రెండు సీజన్ల నుంచి సేంద్రియ సాగు చేస్తున్నారు. క్రిమిసంహారక మందు వాడకుండా చీడపీడల నివారణకు కషాయాలు పిచికారీ చేస్తున్నారు. కషాయాలు సైతం తమ క్షేత్రంలో తామే తయారు చేస్తున్నట్లు చెప్పారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన బియ్యాన్నే తాము ఆహారంగా తీసుకుంటున్నామని తెలిపారు. భవిష్యత్‌లో కమతాల సాగు పెంచి సేంద్రియ ఉత్పత్తులను ఇతరులకు సరఫరా చేస్తామన్నారు.



క్రిమి సంహారక మందులు వాడకుండా..

చనుపల్లి గ్రామానికి చెందిన **ఏలేటి వెంకటేశ్వరరెడ్డి** ఐదేళ్లుగా ప్రకృతి సాగు చేస్తున్నారు. తనకున్న నాలుగు ఎకరాల విస్తీర్ణంలో దేశవాళీ వరి వంగడాలను సాగు చేశారు. క్రిమి సంహారక మందులు వాడకుండా సేంద్రియ పద్ధతిలో వరిసాగు చేపట్టారు. పండించిన ధాన్యం మరపట్టించి కోదాడ, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, జబల్‌పూర్ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కిలో బియ్యం రూ.110లు, 25 కిలోల బస్తా 2,600 వరకు విక్రయిస్తున్నట్లు వివరించారు.



ఎక్కటి శిల్పం గుర్తింపు

గుండాల, న్యూస్‌టుడే: యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వెల్మజాల గ్రామ శివుని బండపై పొడవైన జడతో ఉన్న వీరుడి శిల్పాన్ని గుర్తించినట్లు డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. వెల్మజాల వద్ద ఉన్న వీరుడి శిల్పం భుజాలకు దండ కడియాలు, నడుముకి కత్తి, కాళ్లకు కడియాలు ధరించి, గోచి కట్టి ఉండి, ఛాతి భాగంలో ఏ ఆచ్ఛాదన లేదని వివరించారు. ఎడమ చేతితో విల్లు పట్టుకుని, కుడిచేతితో బాణం సంధిస్తున్నట్లు శిల్పం ఉందన్నారు. కత్తి, విల్లు మొదలైన ఆయుధాలతో పోరాడే వీరులను 'ఎక్కటి' అని పిలుస్తారని తెలిపారు. శిల్పంలోని వీరుడి ముఖ ముందు భాగం, బాణం మధ్యలో తెలుగులో రెండు వరుసల్లో రాసిన శాసనం ఉందని చెప్పారు. భారత పురావస్తు శాఖ ఎపిగ్రఫిస్ట్‌కు సమాచారం ఇవ్వడంతో కొంత సమాచారం తెలిసిందని. వీరుడు 13వ శతాబ్దానికి చెందిన వాడని, కలబడు వంటి పదాలు ఉన్నాయని, దీని ద్వారా అప్పట్లో జరిగిన యుద్ధంలో కలబడినట్లుగా తెలుస్తోందని వివరించారు. ఇలాంటి శిల్పాలను వీరగల్లు అంటారని వెల్లడించారు. రాష్ట్ర కూట పాలకుడు సామాన్య శకం 907 రెండో కృష్ణుని కాలం నాటి శాసనం గ్రామంలోని పోచమ్మ గుడి ముందు ఒకటి, పాటిగడ్డ మీద రాష్ట్ర కూటుల కాలం నాటి మరో రెండు భారీ శాసనాలు ఉన్నాయని వివరించారు. పరిశోధనలో మాజీ సర్పంచి సుబ్రహ్మణ్య ప్రసాద్, సుధీర్, వినోద్ కుమార్ సహాయపడ్డారు.



ఎక్కటి శిల్పంలో శాసనాన్ని చూపిస్తున్న పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి

రుణాలు ఇప్పిస్తామని మోసం చేసిన ముఠా అరెస్టు: ఎస్పీ

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: బ్యాంకు అధికారులమని చెబుతూ, తక్కువ వడ్డీతో రుణాలు ఇప్పిస్తామని అమాయక రైతులు, వ్యాపారులను మోసం చేస్తున్న ముఠాలో ఏడుగురిని అరెస్టు చేయగా, ఒకరు పరారీలో ఉన్నట్లు నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు.

◆ నల్గొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఇప్పటి వరకు రూ.26 లక్షలు వసూళ్లు చేసుకున్న వీరి నుంచి రూ.1.20 లక్షల నగదు, రైతుల పాసుపుస్తకాలు, అగ్రిమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

◆ పెద్దవూర మండలం వెలుగు గూడెం గ్రామానికి చెందిన కట్టేబోయిన పరమేశ్(42), మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలేనికి చెందిన మమ్ముల జ్యోతి స్వరూప్(34), నార్కట్‌పల్లి మండలం ఏపీ లింగోటం గ్రామానికి చెందిన షేక్ వజీర్ (40) (ప్రస్తుతం పరారీ), మాడ్గులపల్లి మండల కేంద్రానికి చెందిన కొండా శ్రీను (40), మిర్యాలగూడ బాలాజీ నగర్‌కు చెందిన గోగుల సురేశ్ (28), మిర్యాలగూడ మండల పరిధిలోని జప్తి వీరప్పగూడెం గ్రామానికి చెందిన చిలుముల సైదులు (35), పెద్దవూర మండలం తెప్పలమడుగు గ్రామానికి చెందిన పల్లేబోయిన నాగరాజు(32), నార్కట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన ముప్పిడి సైదులు (35) ఓ ముఠాగా ఏర్పడ్డారు.

◆ బ్యాంకు అధికారులు, ఫీల్డ్ ఆఫీసర్లు, రుణాలు ఇప్పించే వారిగా కొద్ది రోజుల నుంచి జిల్లాలో ఏడు మండలాలకు చెందిన 28 మంది రైతుల నుంచి రూ.26 లక్షల వరకు వసూళ్లు చేశారు. బాధితుల ఫిర్యాదుతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా వాస్తవాలు అంగీకరించారు. దీంతో వారిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ చెప్పారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సాగర్ సీఐ బీసన్న, పెద్దవూర ఎస్సై వీరబాబు పాల్గొన్నారు.



నల్గొండ: వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

ఇద్దరికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష

ఆలేరు, న్యూస్‌టుడే: మారణాయుధాలు కలిగి ఉండి పోలీసులకు పట్టుబడిన కేసులో ఇద్దరికి ఏడేళ్ల జైలు, జరిమానా విధిస్తూ భువనగిరి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి తీర్పునిచ్చారని ఆలేరు ఎస్సై పి.రజనీకర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లా కొత్త పాల్వంచకు చెందిన వనపాకుల రాంబాబు అలియాస్ ఆజాద్ అలియాస్ ఈశ్వర్(35), వరంగల్ జిల్లా కేసముద్రం మండలం మహమూద్‌పట్టణానికి చెందిన పిట్టల శ్రీనివాస్ అలియాస్ రాము(38) తుపాకీ(పిస్టల్)తో ఇతరులను బెదిరిస్తూ డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారు. 2011లో ఆలేరు శివారులో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టిన క్రమంలో పట్టుబడ్డారు. ఇద్దరి నుంచి రెండు పిస్టళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. కేసు విచారణ అనంతరం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఇద్దరు నిందితులను దోషులుగా నిర్ధారించారు. ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.సత్యనారాయణ ప్రాసిక్యూషన్ తరపున వాదించారు. కోర్టు కానిస్టేబుల్ డి.స్వామి కేసు ట్రయల్ నడిపించారు.

గంజాయి పట్టివేత!

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ ప్లాజా వద్ద కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని రాచకొండ ఎస్వోటీ పోలీసులు పక్కా సమాచారం మేరకు సోమవారం సాయంత్రం పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖ ఏజెన్సీ ప్రాంతం నుంచి మహారాష్ట్రలోని నాసిక్‌కు గంజాయిని తరలిస్తున్నట్టు తెలిసింది. గంజాయి తరలిస్తూ పోలీసులకు చిక్కిన నిందితులు మహారాష్ట్రకు చెందిన వారే. సుమారు 54 కిలోల గంజాయిని కొనుగోలు చేసి కారు సీట్ల కింద దాచి రహస్యంగా తరలిస్తున్న సమాచారం పోలీసులకు అందింది. ఎస్వోటీ పోలీసులు పంతంగి టోల్‌ప్లాజా వద్ద కాపు కాసి గంజాయిని, నిందితులను పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. చౌటుప్పల్ పోలీసులు నిందితుల నుంచి పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. గంజాయి కేసు వివరాలను మంగళవారం వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

నల్గొండ

•నల్గొండ • మునుగోడు • నకిరేకల్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు డీవీఎస్ ఫణికుమార్, ప్రధానకార్యదర్శి జనార్దన్‌రెడ్డిలు ఆ సంఘం రాష్ట్రకౌన్సిల్ సమావేశంలో పలు సమస్యలను నల్గొండ జిల్లాశాఖ పక్షాన విన్నవించారు. సీపీఎస్ రద్దుకై పీఆర్‌టీయూ కార్యాచరణ ప్రకటించే సమయం ఆసన్నమైందని చెప్పారు. ఉపాధ్యాయుల, ఉద్యోగుల ఆరోగ్యకార్డులు అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో అమలయ్యేలా చూడాలన్నారు. దసరా కానుకగా డీఏలు ప్రకటించాలని, రిటైర్డ్ ఉద్యోగులకు లభించే ఆర్థిక బెనిఫిట్స్‌ను వెంటనే చెల్లించాలని కోరుతూ రాష్ట్ర సంఘానికి ప్రాతినిధ్యం చేశారు.

కార్మికులకు సన్మానం

చిట్యాల,న్యూస్‌టుడే: పుర కార్యాలయానికి చెందిన 20మంది కార్మికులను తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు కూనూరు సంజయిదాస్‌గౌడ్ సోమవారం తన నివాసంలో సన్మానించారు. నూతన దుస్తుల కొనుగోలుకోసం వారికి రూ.10వేలు అందజేశారు. పురకార్మికులు పండుగ రోజు కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పురకార్మికులు జడల పెద్ద నరసింహయాదవ్, మేడి యాదయ్య, పాల లక్ష్మయ్య, పోకల ముత్తయ్య, జిట్ట దుర్గేశ్, నల్ల శంకర్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80085 52710, 80085 66199, 8008574421, 80085 74385

నల్గొండ పురపాలిక, న్యూస్‌టుడే:

? నల్గొండలోని వైఎస్ఆర్ సర్కిల్ నుంచి గడియారం వెళ్లే మార్గంలో రోడ్లపై ఇసుక రేణువులు శుభ్రం చేయక పోవడంతో వాహనాల రాకపోకల కారణంగా కళ్లల్లో దుమ్ము, ఇసుక పడి ఇబ్బందులు పడుతున్నాం.
– రామకృష్ణ, నల్గొండ

✔ పరిశీలించి వెంటనే రోడ్లు శుభ్రం చేయిస్తాం.
– శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టరు, నల్గొండ పురపాలిక

పచ్చందాల బాట



నల్గొండ మండలంలోని పలు రోడ్లు పచ్చందాలను సంతరించుకున్నాయి. రోడ్డుకు ఇరువైపులా గతంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి పచ్చదనంతో కనువిందు చేస్తున్నాయి. నల్గొండ నుంచి తొరగల్ వెళ్ల రోడ్డు పచ్చని చెట్లతో దర్శన మిస్తున్నాయి. తొరగల్ నుంచి ముషంపల్లి రోడ్డు పచ్చని చెట్లతో చూపరులను ఆనందింప చేస్తున్నాయి. ఎండలో చల్లదనం ఇవ్వడంతో రహదారి నుంచి వెళ్లేవాళ్లంతా కాసేపు సేదతీరుతున్నారు. పెద్ద సూరారం గ్రామ రోడ్డు పచ్చని చెట్లతో ఆనందింపజేస్తుంది. అటువైపు నుంచి వెళ్లేవారికి చల్లదనాన్ని ఇస్తున్నాయి.

–నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే:

దోమలకు ఆవాసాలు..
మురుగు గుంతలు

నకిరేకల్ మండలం మూసీ రోడ్‌లోని నోముల గ్రామంలో ప్రధాన రోడ్ల పక్కనే నిర్మించిన గృహాలకు డ్రైనేజీ కనెక్షన్ లేకపోవడంతో గ్రామస్థులు ప్రతి ఇంటి ముందు మురుగు గుంతలు ఏర్పాటు చేసి వృథా నీరు అందులోకి వెళ్లే విధంగా ఏర్పాటు చేసుకున్నారు. దీంతో నీటి ప్రవాహం ఎక్కడికి వెళ్లలేక దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. నిండిన మురుగునీరు రోడ్డుపై ప్రవహించి రోడ్లన్నీ బురద మయంగా మారాయి. ఇలాగే ఉంటే గ్రామంలో ప్రజలు విషజ్వరాల బారిన పడే ప్రమాదం ఉంది. – ఈనాడు నల్గొండ



ఎండిపోతున్న మొక్కలు

నల్గొండలోని చర్లపల్లి అర్బన్ పార్కు ఎదుట చెట్లు ఎండిపోతున్నాయి. సుందరీకరణలో భాగంగా పట్టణ ప్రజలకు ఆహ్లాదం అందించేందుకు సుమారు రూ.4కోట్లకు పైగా మున్సిపల్ అధికారులు వ్యయం చేసి పార్కును అభివృద్ధి చేశారు. నిర్వహణ లేమితో ప్రజలకు ఆహ్లాదం కరవైంది. ఆకర్షణీయంగా నాటిన వెదురు పోలిన చెట్ల మొక్కలు పార్కు ప్రారంభం కాకముందే చనిపోతున్నాయి.



–నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:

రహదారుల పక్కన వ్యర్థాల కుప్పలు

నీలగిరిలో పలు రహదారులు వ్యర్థాల డంపింగ్ కేంద్రాలుగా మారుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా పూర్తిగా మట్టి, వ్యర్థాలతో నిండిపోయింది. ఆర్‌అండ్‌బీ, పుర అధికారుల నిర్లక్ష్యంతో రోడ్ల పొడవున వ్యర్థాలతో కూడిన మట్టికుప్పలు దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా పానగల్ నుంచి చర్లపల్లి వెళ్లే మార్గం, ఎన్జీ ఆర్‌కాలనీ నుంచి హౌసింగ్‌బోర్డుకాలనీకి వెళ్లే బైపాస్ రోడ్డు, రాక్‌హిల్స్ కాలనీ నుంచి బైపాస్ వెళ్లే మార్గంలో ఇళ్లు, భవనాలు కూల్చి వేసిన వ్యర్థాలను సైతం రోడ్లపై పారబోయడంతో ఆ ప్రాంతాలు అధ్వానంగా మారుతున్నాయి. వ్యర్థాల కుప్పలను పాములు ఆశ్రయంగా మార్చుకుని ఇళ్లలోకి వస్తున్నాయని, రోడ్డుపై రాత్రి సమయంలో ప్రయాణించాలంటే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వ్యర్థాలు, మట్టికుప్పలు రోడ్ల పక్కన పోయకుండా నివారించాలని కోరుతున్నారు. మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్ సయ్యద్‌ను వివరణ కోరడంతో పట్టణంలో ఎక్కడైన రోడ్ల పక్కన వ్యర్థాలు పారబోసిన వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. –నల్గొండ పురపాలిక, న్యూస్‌టుడే:



సేంద్రియ ఎరువులు వినియోగించాలి

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు సేంద్రియ ఎరువులు వినియోగించి సాగు చేయాలని కోణం ఫౌండేషన్ సంస్థ చెందిన బి.మహేష్ అన్నారు. నల్గొండ మండలం అన్నెపర్తిలో సోమవారం పత్తి దినోత్సవాన్ని నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. పత్తి పంటలో తరుచుగా తలెత్తే సమస్యలకు సూచనలు చేశారు. బహుళ పంటల సాగును ప్రోత్సహిస్తూ రైతులకు ఉచితంగా కూరగాయల, పప్పు ధాన్యాల విత్తనాలను అందించి సన్మానించారు. ఇందులో ఫౌండేషన్ చెందిన వంశీ, అంజీ రైతులు సైదులు, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు నల్గొండ కల్చరల్, నకిరేకల్, న్యూస్‌టుడే

నల్గొండ: **నటరాజ్:** దేవర, **తిరుమల:** సత్యం సుందరం, **వెంకటేశ్వర:** శ్వాగ్, **పీవీఎన్:** రామ్‌నగర్ బన్నీ
నకిరేకల్: **రామకృష్ణ-** శ్వాగ్, **వెంకటేశ్వర-** దేవర

విశ్రాంత పోలీసులకు సహకరించాలి

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో విశ్రాంత పోలీస్ అధికారుల సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులు సహకరించాలని ఆ సంఘం



ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌ను కలిసిన విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం నాయకులు

జిల్లా అధ్యక్షుడు గోలి లక్ష్మారెడ్డి అన్నారు. కలెక్టర్ నారాయణ రెడ్డితో పాటు ఎస్పీ శరత్ చంద్ర పవార్‌ను సోమవారం సంఘం నాయకులు కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం. డేవిడ్, సురేందర్‌రెడ్డి, పి. భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ అమలు చేయాలి: చిరుమర్తి

చిట్యాల,న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు రైతుల రూ.2లక్షల పంటరుణాలను బేషరతుగా మాఫీచేయాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిట్యాల తహసీల్ కార్యాలయం ఎదుట సోమవారం భారాస ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో లింగయ్య మాట్లాడారు. రైతులు పండించే అన్ని రకాల పంట దిగుబడులకు రూ.500 బోనస్‌గా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుబంధు నిధులను రైతుల ఖాతాల్లో వెంటనే జమచేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో ట్రయల్ రన్ పూర్తి చేసిన బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు మోటార్లను ఆన్‌చేసి రైతులకు సాగునీరందించాలన్నారు. ఆపార్టీ చిట్యాలశాఖ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్యగౌడ్, మండలాధ్యక్షుడు అయిలయ్య, నాయకులు కొలను వెంకటేశ్, సుంకరి యాదగిరి, రైతు విభాగం మండలాధ్యక్షుడు మర్ల రాంరెడ్డి, కార్మిక విభాగం మండలాధ్యక్షుడు కొలను సతీశ్, చిట్యాల పుర వైస్‌ఛైర్మన్ కూరెళ్ల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కరపత్రం ఆవిష్కరించిన కలెక్టర్

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: సమాచార హక్కు చట్టం- 2005 ఆవిర్భావ దినోత్సవంను పురస్కరించుకుని ఈ నెల 10న హైదరాబాద్‌లో నిర్వహించే సమాచారహక్కు చట్టంపై అవగాహన సదస్సు కరపత్రంను కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో సోమవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర, సమాచారహక్కు పరిరక్షణ సమితి జాతీయ ఛైర్మన్ డా.బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్, జలసాధన సమితి జాతీయ అధ్యక్షుడు దుశ్శర్ల సత్యనారాయణతో కలిసి కలెక్టర్ కరపత్రాన్ని విడుదల చేశారు. ఎస్‌హెచ్‌పీఎస్ నాయకులు సైదులు, మేఖల శ్రీహరి, కాడబోయిన సాయి, మల్లయ్య, శంకర్, రాంబాబు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో సమాచారహక్కు చట్టంపై అవగాహన సదస్సు కరపత్రం విడుదల చేస్తున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి

భాజపా బలోపేతానికి కృషి

నకిరేకల్, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో భాజపా బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ ఎస్సీ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



నకిరేకల్: సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొగులయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకన్న

నకిరేకంటి మొగులయ్య, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకన్న కోరారు. నకిరేకల్ పుర పరిధిలోని 220, 221 నెంబర్ల పోలింగ్ బూత్‌ల పరిధిలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సోమవారం మాట్లాడారు. కిసాన్‌మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయన్న, నాయకులు మధుకర్‌రెడ్డి, మురళీ మోహన్, శ్రీను, పి. సైదులు, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.గోపి పాల్గొన్నారు.

రోజుకో రూపం..
తరించిన భక్తజనం



నకిరేకల్: శిరిడిఐశ్వర్యసాయి మందిరంలో సప్త చండీహోమం నిర్వహిస్తున్న భక్తులు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లాలో ఏర్పాటు చేసిన దుర్గామాత సోమవారం లలితా త్రిపుర సుందరీ దేవిగా, చండీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు అన్నదానం చేశారు.

–న్యూస్‌టుడే, బృందం



కనగల్: లలితా త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు



నల్గొండ: రాక్‌హిల్స్ కాలనీలోని దుర్గాదేవి విగ్రహం వద్ద నృత్యం చేస్తున్న చిన్నారులు



లక్ష్మీనగర్ కాలనీలో..



నకిరేకల్: చందుపట్ల దుర్గామాత మండపంలో భవానీమాల ధరించిన భక్తులు..



సావర్కర్ నగర్‌లో అమ్మవారి పూజలో పాల్గొన్న భవానీ స్వాములు భక్తులు



కట్టంగూరు మండలం మునుకుంట్లలో..

డీజే సౌండ్‌ను అనుమతించాలని ధర్నా

నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: డీజే సౌండ్‌ను అనుమతించాలని కోరుతూ డీజే యజమానులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో డీజే సౌండ్స్ వల్లనే ప్రజల్లో ఉత్తేజం నింపడం జరిగిందన్నారు. డీజే వల్ల సమస్యలు ఏర్పడితే నిబంధనలు విధించి అమలు చేయాలని వివరించారు. సంఘం ప్రతినిధులు శ్రీనివాస్, మల్లిఖార్జున్, సైదులు, విజయ్, నందు, తదితరులు పాల్గొన్నారు.

వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ఇజ్రాయెల్ చేస్తున్న మారణకాండను ఖండిస్తున్నామని సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నెల్లికంటి సత్యం తెలిపారు. నల్గొండలో సోమవారం దాడులను నిరసిస్తూ సుభాష్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లా



నల్గొండలో నిరసన తెలుపుతున్న సీపీఐ, సీపీఎం నాయకులు

డుతూ.. భారత ప్రభుత్వం ఈ దాడులను ఆపాలని ఇజ్రాయెల్‌పై ఒత్తిడి తేవాలని కోరారు. ఇందులో సీపీఐ, సీపీఎం నాయకులు తుమ్మల వీరారెడ్డి, శ్రవణ్ కుమార్, ఐలయ్య, శ్రీశైలం, వీరస్వామి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుకు డిమాండ్

నల్గొండ విద్యావిభాగం: మహనీయుల ఆశయాలకనుగుణంగా విద్యను ప్రజాస్వామ్యీకరించాలని ధర్మ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పాక లింగమల్లు యాదవ్ తెలిపారు. సోమవారం నల్గొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎస్ విధానం రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలు చేయాలని, గురుకులాలకు పక్కా భవనాలు నిర్మించాలని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించాలన్నారు. సంఘం జిల్లా కన్వీనర్ బొంగరాల నాగయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మామిడి శంకర్, యాదాద్రి జిల్లా కన్వీనర్ ఎర్ర సుధాకర్, కోకన్వీనర్ నగేష్ మహారాజ్, పేర్ల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పాక లింగమల్లుయాదవ్

కేతేపల్లిలో ఘనంగా జపమాలమాత ఉత్సవం

కేతేపల్లి, న్యూస్‌టుడే: కేతేపల్లి జపమాలమాత చర్చిలో సోమవారం ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కేతేపల్లి క్రైస్తవ కుటుంబాల నుంచి మత గురువులుగా మారి.. వివిధ ప్రాంతాలలో పనిచేస్తున్న వారు జపమాలమాత ఉత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. సోమవారం కేతేపల్లి చర్చి విచారణ ఫాదర్ ఫ్రాంచీస్ ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో ఫాదర్లు ఆర్లగడ్డ జోసఫ్, కాట ఇన్నయ్య, మాదాను ఆరోగ్యం, బంధనాదం ఆరోగ్యం, మాదాను లూర్ధుశౌరి తదితరులు పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో క్రైస్తవ మతకన్యలు, చర్చి పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



కేతేపల్లి చర్చిలో పూజలు చేస్తున్న క్రైస్తవ మతగురువులు

ప్రజావాణిని పక్కాగా నిర్వహించాలి

మాడ్గులపల్లి, న్యూస్‌టుడే: ప్రజావాణిని పక్కాగా నిర్వహించాలని సీఈవో ప్రేమ్‌కరణ్ రెడ్డి అన్నారు. మాడ్గులపల్లి మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చే వినతులకు వివిధ శాఖలకు చెందిన అధికారులు తక్షణమే పరిష్కార మార్గం చూపాలన్నారు. అన్ని శాఖల అధికారులు ప్రజావాణికి హాజరు కావాలని కోరారు. మండల స్థాయిలో ఇచ్చే ఫిర్యాదులకు సహితం పరిష్కారం లభిస్తోందని ప్రజలకు నమ్మకం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంగీత తదితరులు పాల్గొన్నారు.



మాడ్గులపల్లిలో మాట్లాడుతున్న సీఈవో ప్రేమ్‌కరణ్ రెడ్డి

ఫలించిన ఏడేళ్ల నిరీక్షణ..

నకిరేకల్, న్యూస్‌టుడే: ఏడేళ్ల నిరీక్షణ ఫలించింది.. సర్కారు కొలువు కల సాకారమైంది.. నకిరేకల్‌కు చెందిన బంటు లక్ష్మి గిరిజన గురుకులంలో పీఈటీ ఉద్యోగానికి ఎంపికైంది. హైదరాబాద్ శిల్పకళా వేదికలో వివిధ శాఖల్లో ఉద్యోగాలకు ఎంపికైన వారికి సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం నియామకపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బంటు లక్ష్మి పీఈటీగా నియామకపత్రం అందుకున్నారు. 2017లో ఈ ఉద్యోగం కోసం పరీక్ష రాశారు. కోర్టు తీర్పుతో నియామకాలకు మార్గం సుగమం కావడంతో ఏడేళ్ల నిరీక్షణ ఫలించిందని లక్ష్మి వివరించారు. ఈ కొలువుపై ఆశలు వదులుకున్న సమయంలో ఉద్యోగానికి ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. లక్ష్మి తండ్రి బంటు సత్తయ్య నకిరేకల్‌లో గీతకార్మికుడు, తల్లి వ్యవసాయ కూలీ. లక్ష్మి భర్త గోపాల్ ప్రైవేట్‌లో ఉద్యోగం చేస్తున్నారు. ప్రస్తుతం మునుగోడు కస్తూర్బా పాఠశాలలో ఒప్పంద పీఈటీగా పనిచేస్తున్నారు. ఇంటర్‌వరకు నకిరేకల్, సూర్యాపేటలో బి-ఫార్మసీ పూర్తిచేసింది. జేఎల్ ఫిజికల్ డైరెక్టర్ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో కృషిచేస్తున్నానని, భర్త గోపాల్, కుటుంబీకుల ప్రోత్సాహం మరువలేనిదని చెప్పారు. పీఈటీ కావాలన్న లక్ష్యం చిన్నపటి నుంచే ఉందని, నా ఆసక్తిని గమనించిన సోదరుడు రమేశ్ తాను కరాటే శిక్షణ తీసుకునేలా ప్రోత్సహించారని వివరించారు. క్రీడా కోటాలో అయినా ప్రభుత్వం ఉద్యోగంలో చేరాలన్న పట్టుదలతో కరాటేలో బ్లాక్‌బెల్టు కూడా సాధించానని లక్ష్మి వివరించారు.



భర్తతో కలిసి పీఈటీ ఉద్యోగ నియామకపత్రం చూపుతున్న లక్ష్మి

అత్యాచారయత్నం కేసులో నిందితుడి రిమాండ్

చండూరు, న్యూస్‌టుడే: మైనర్ బాలికపై తాగిన మైకంలో యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన చండూరు మండల పరిధిలోని ఓ గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లాకు చెందిన వాటుపల్లి బాబీ (24) కొన్ని రోజుల క్రితం తాపీ పనులు చేసేందుకు మండలంలోని ఓ గ్రామానికి వచ్చి అక్కడే ఉంటున్నాడు. ఈ క్రమంలో గ్రామంలోని ఓ కుటుంబంతో పరిచయం ఏర్పడింది. ఆ కుటుంబంలో తాతతో పాటు పదకొండు ఏళ్లలోపు వయసున్న ఇద్దరు మనుమరాళ్లు ఉంటున్నారు. తాతతో కలిసి ఆ యువకుడు అప్పుడప్పుడు మద్యం తాగేవాడు. ఇదే క్రమంలో ఆదివారం రాత్రి మద్యం తాగి వృద్ధుడితో ముచ్చటించి.. కుటుంబంలోని బాలికకు చాక్లెట్లు కొనిస్తానని చెప్పి బయటకు తీసుకెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఆ బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటయ్య తెలిపారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

నల్గొండ అర్బన్: మాదక ద్రవ్యాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని ఒకటవ పట్టణ సీఐ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పాతబస్తీ పూల్ సెంటర్ వద్ద సోమవారం పోలీస్ కళజాత బృందంతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సరదా కోసం మొదలెట్టిన మందు, సిగరెట్, గంజాయి వాడకం వ్యసనంగా మారి నిండు జీవితాలు నాశనమవుతున్నాయని తెలిపారు. మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉన్నప్పుడే సమాజంలో మార్పు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సురేశ్, కళాజాత సిబ్బంది ఎడ్ల శ్రీను, సత్తయ్య, వట్టిపల్లి శ్రీను పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల రన్నర్‌గా నల్గొండ

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సంబరాల్లో భాగంగా ఈ నెల 5న ప్రారంభమైన రాష్ట్రస్థాయి అండర్-17 బాలుర ఫుట్‌బాల్ పోటీలు సోమవారం ముగిశాయి. పది ఉమ్మడి జిల్లాల జట్లు మ్యాచ్‌లలో తలపడ్డాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వరుసగా ఖమ్మం, నల్గొండ, రంగారెడ్డి జట్లు నిలిచాయి. విజేత జట్లకు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ క్రీడల పరిశీలకుడు వడ్డెన్న ట్రోఫీలను అందజేశారు.



ట్రోఫీ అందుకున్న నల్గొండ జట్టు

మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ

చండూరు, న్యూస్‌టుడే: చండూరు పురపాలికలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అయి నీరంతా వృథాగా పారుతోంది. చండూరు పురపాలికతో పాటు చుట్టుపక్కల శిర్దేపల్లి, తాస్కానిగూడెం, ఉడుతలపల్లి, కస్తాలతో పాటు పలు గ్రామాలకు సరఫరా అయ్యే ప్రధాన పైపులైన్ కావడంతో నీరు ఎక్కువ మొత్తంలో రోడ్డుపై వృథాగా పారడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. లీకేజీతో చండూరు పురపాలికతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది.



నియామకం

కేతేపల్లి, న్యూస్‌టుడే: అఖిల భారత అసంఘటితరంగ కార్మికులు, ఉద్యోగుల కాంగ్రెస్ (కేకేసీ) ఉమ్మడి జిల్లా కమిటీని నియమిస్తూ ఆ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కౌసల్ సమీర్ సోమవారం ప్రకటించారు. అధ్యక్షునిగా కేతేపల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన కత్తుల వీరన్న, ఉపాధ్యక్షునిగా పల్నాటి గోవర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సిద్దోజు రమేష్‌చారి (సూర్యాపేట), కార్యదర్శిగా పి. అంబేడ్కర్ (నల్గొండ), సహాయ కార్యదర్శిగా బొజ్జ మారయ్య (మిర్యాలగూడ)లు ఎన్నికయ్యారని తెలిపారు.



కత్తుల వీరన్న



గోవర్ధన్‌రెడ్డి

చిట్యాల గ్రామీణం: చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన రావుల మధుసూదన్ బీసీ సంఘం జిల్లా యువజన విభాగం జనరల్ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య సోమవారం హైదరాబాద్‌లో ముధుసూదన్‌కు నియామక పత్రం అందజేశారు.

దుండగులను శిక్షించాలి

నకిరేకల్, న్యూస్‌టుడే: నకిరేకల్‌లో సీనియర్ న్యాయవాది జాల కొమురయ్య ఇంట్లోకి ఆదివారం ఇద్దరు దుండగులు అక్రమంగా ప్రవేశించి, బెదిరింపులకు పాల్పడి భయభ్రాంతులకు గురి చేసిన ఘటనను నకిరేకల్ బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తుందని అధ్యక్షుడు పూజర్ల శంభయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొమురయ్యకు బార్ అసోసియేషన్ అండగా ఉంటుందని, దుండగులను శిక్షించాలని పోలీసులను కోరారు.

మిర్యాలగూడ

•మిర్యాలగూడ •నాగార్జునసాగర్ •దేవరకొండ

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ తక్షణమే అమలు చేయాలి

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: సుప్రీం కోర్టు తీర్పునకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ మిర్యాలగూడ నియోజకవర్గ కన్వీనర్ మచ్చ ఏడుకొండలు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగ నోటిఫికేషన్లు అన్నీ వర్గీకరణ తర్వాతే చేపడతామని రాష్ట్ర ప్రభుత్వం మాట మార్చిందని ఆరోపించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి నాగరాజు, మధు, నాగరాజు, శ్రీనివాస్, సుధాకర్, చైతన్య, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే:

? హిల్‌కాలనీలోని కొన్ని వీధుల్లో వీధిదీపాలు పనిచేయకపోవడంతో అంధకారంలో ఉంటున్నాయి. – రవి, హిల్‌కాలనీ

✔ వీధిదీపాల మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. – శ్రీను, పుర కమిషనర్, నందికొండ

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 77994 92939 99121 74975 98487 81656

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో లారీ అసోసియేషన్ సమీపంలో లారీలను రోడ్డుపైనే నిలుపుతుండడంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. – ఉపేందర్, మిర్యాలగూడ

✔ లారీలను రోడ్డుపై నిలపకుండా చర్యలు తీసుకుంటాం. – బండి మోహన్, ట్రాఫిక్ ఎస్సై, మిర్యాలగూడ

త్రిపురారం, న్యూస్‌టుడే:

? మండంలోని బెజ్జికల్ ఎస్సీ కాలనీలో ఎప్పటి నుంచో విద్యుత్తు తీగలు వేలాడుతున్నాయి. వాటి స్థానంలో కొత్త తీగలు ఏర్పాటు చేయాలి. –జొన్నలగడ్డ విజయ్, బెజ్జికల్

✔ తీగలను పరిశీలించి అవసరమైతే కొత్త తీగలను ఏర్పాటు చేస్తాం. – మండల విద్యుత్తు ఏఈ రవీందర్‌రెడ్డి

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వినతి

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: ఇటీవల వేములపల్లి మండల పరిధిలోని సాగర్ ఎడమకాల్వలో గల్లంతై మృతి చెందిన అంగన్‌వాడీ ఉపాధ్యాయిని అనూష కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ అంగన్‌వాడీ సిబ్బంది సోమవారం మిర్యాలగూడలో సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు వినతిపత్రం అందించారు. కార్మిక సంఘాల నాయకులు బంటు వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి మాట్లాడుతూ.. అనూష కుటుంబ సభ్యులకు రూ.20లక్షల పరిహారం అందించడంతో పాటు ఇద్దరు పిల్లల చదువు బాధ్యతలను ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో [illegible], బైరెడ్డి రాణి, సరిత, భవాని, పుల అరుణ, వనజ, విజ్జమ్మ, పార్వతి, రాజారాం, ధనలక్ష్మి, మాధవి, లలిత తదితరులు పాల్గొన్నారు.

★ మిర్యాలగూడ మండల పరిధిలోని చింతపల్లి గ్రామ శివారు సర్వే సంఖ్య 384లోని క్వారీల్ గత 60 ఏళ్లుగా రాళ్లు కొడుతూ జీవనం సాగిస్తున్న 150 కుటుంబాలకు అన్యాయం జరిగేలా ఆ స్థలంలో నిర్మించ తలపెట్టిన సమీకృత గురుకుల పాఠశాలను నిలిపివేయాలని కోరుతూ పలువురు సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు వినతిపత్రం అందించారు.


దేవా.. కౌలు తీసుకోవా..!



చింతపల్లి, న్యూస్‌టుడే

గ్రామాల్లోని దేవాలయాల పరిధిలో వేలాది ఎకరాల్లో మాన్యం భూములున్నాయి. ఆలయాల నిర్వహణకు అప్పట్లో కేటాయించిన భూములను కౌలుకిచ్చి, వచ్చే ఆదాయంతో అభివృద్ధి చేయాల్సి ఉంది. ఏటా వీటికి కౌలు నిర్వహించాల్సి ఉన్నా.. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవటం లేదు. ఏళ్ల తరబడి బహిరంగ వేలం నిర్వహించకుండా నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారు. దీంతో చాలా చోట్ల ఇవి అన్యాక్రాంతం అవుతున్నాయి. గ్రామాల్లో ఏళ్లుగా రైతులు కౌలుకు తీసుకొని సాగుచేసుకుంటున్నా.. కౌలు మాత్రం చెల్లించేందుకు ముందుకు రాకపోవటంతో ఆలయాల్లో దేవతలకు ధూపదీప నైవేద్యం లేకుండా పోతోంది. కొందరు తక్కువ ధరకు తీసుకొని తిరిగి అధిక మొత్తంలో ఇతరులకు కౌలుకు ఇస్తున్నారు.

నియోజకవర్గంలో ఇలా..



మదనపురంలో కౌలులో ఉన్న దేవాలయ భూములు

దేవరకొండ నియోజకవర్గంలో 902 ఎకరాలకుపైగా భూములున్నాయి. వీటిలో ఇప్పటివరకు సుమారు 277 ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయి. చింతపల్లి మండలంలోని మదనపురంలోని శ్రీలక్ష్మి నృసింహ ఆలయ పరిధిలో మదనపురం, పోలేపల్లి రాంనగర్, [illegible], గొల్లపల్లి గ్రామాల్లో ఈ ఆలయం పేరు మీద 257.31 ఎకరాలు, గొడుకొండ్లలో వేణుగోపాలస్వామి ఆలయం పరిధిలో 120, చింతపల్లిలోని శ్రీవేంకటేశ్వర దేవాలయం పరిధిలో 105 ఎకరాల భూములున్నాయి. దేవరకొండ మండలంలోని ముదిగొండలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ పరిధిలో 8.04, పట్టణంలోని మల్లికార్జునస్వామి ఆలయ పరిధిలో 1.36, శ్రీసీతారామచంద్రస్వామి ఆలయానికి 2.00 ఎకరాలు, నాగర్‌కర్నూల్ జిల్లా చారగొండ మండలంలోని సిర్సనగండ్ల గ్రామంలో శ్రీసీతారామచంద్ర దేవాలయానికి సంబంధించిన ఆలయ భూములు డిండి మండలంలోని చెర్కుపల్లిలో 10.00 ఎకరాలు, పెద్దఅడిశర్లపల్లి మండలంలోని కోదండపురంలో వేంకటేశ్వర స్వామి దేవాలయం కింద 102 ఎకరాల భూములున్నాయి.

వేలం జాడేది..

గ్రామాల్లోని ఆలయ భూములను రైతులు 1956 నుంచి కౌలుకు తీసుకుంటూ సాగు చేసుకుంటున్నారు. సమావేశాలు ఏర్పాటు చేసి బహిరంగ వేలం నిర్వహించాల్సి ఉంది. ఆలయ పరిరక్షణ పాలక మండలిని ఏర్పాటు చేస్తున్నా ఆశించిన ఫలితాలు రావడం లేదు. పాలక వర్గం వారు ఆయా గ్రామాలకు చెందినవారు కావడంతో కౌలు వసూళ్లు చేయటం లేదు. రైతులు సహకరించడం లేదన్న కారణంతో అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. ఏటా వేలం నిర్వహించకపోవడంతో పాత రైతులే కౌలుకు తీసుకొని ఏడాదికి రూ.1,500 చెల్లిస్తున్నారు. ప్రస్తుతం కౌలు ఎకరానికి రూ.5వేల ధర పలుకుతోంది.

☛ దీనిపై దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మిని వివరణ కోరగా.. 'కౌలుకు తీసుకున్న రైతుల నుంచి డబ్బులు వసూళ్లు చేసేందుకు కృషి చేస్తున్నాం. ఆలయాలకు కొత్తగా ఏర్పాటు చేసిన పాలకవర్గాలకు ఈ బాధ్యత అప్పగించాం. వచ్చే ఏడాది మార్చిలో వేలం నిర్వహిస్తామని' తెలిపారు.

పట్టు పురుగుల పెంపకంతో అధిక లాభాలు



రైతులకు సూచనలిస్తున్న డా.టి.మాధురి

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: పట్టు పురుగుల పెంపకంతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్ర నిపుణురాలు డా.టి. మాధురి తెలిపారు. సోమవారం మండలంలోని [illegible] గ్రామంలో రైతు చేపూరి ప్రమోద్ గౌతమ్ సాగు చేస్తున్న మల్బరీ తోటను సందర్శించారు. రైతులకు మల్బరీతోట సాగు, పట్టుపురుగుల పెంపకంలో పలు సలహాలు, సూచనలు చేశారు. చిన్న, సన్నకారు రైతులు పట్టు పురుగుల పెంపకం వల్ల నెలకు సుమారు రూ.50 వేల వరకు ఆదాయం పొందవచ్చని తెలిపారు. మల్బరీ తోటలు సాగు చేసే రైతులకు సెంట్రల్ సిల్క్ బోర్డు రాయితీ అందిస్తుందని వివరించారు. రైతులు సంజీవకుమార్, ప్రమోద్ గౌతమ్, భువనేశ్వరి, కిషోర్‌కుమార్ తదితరులున్నారు.

క్రైం రిపోర్ట్

వివాహిత బలవన్మరణం

అడవిదేవులపల్లి, న్యూస్‌టుడే: అనారోగ్య కారణాలు, మానసిక వేదనతో వివాహిత బలవన్మరణానికి పాల్పడిన ఘటన సోమవారం తెల్లవారుజామున అడవిదేవులపల్లి మండలం [illegible] గ్రామపంచాయతీ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీ తండాకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ రమావత్ తులసీరాం భార్య వాలి(27) గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. తన కోసం కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారని తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వారిని కిందకు దించగా అప్పటికే మృతిచెందింది. వాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. వాలి మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించి మరణోత్తర పరీక్షల అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి తండ్రి వస్రాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాంమూర్తి తెలిపారు. సోమవారం ఉదయం మండలంలోని చెన్నారం నుంచి అక్రమంగా మూడు ఇసుక ట్రాక్టర్లు వస్తున్నట్లు ఓ వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు వాటిని పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. అక్రమంగా తరలిస్తున్న నక్క అంజయ్య, దూదిమెట్ల శ్రీను, కనకటి భద్రయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

పాలస్తీనాపై దాడులకు వామపక్షాల నిరసన

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం మిర్యాలగూడ అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య మాట్లాడుతూ అమెరికా ఇజ్రాయెల్‌కు ఆయుధాల సరఫరాను నిలిపివేయాలని పాలస్తీనా ప్రజల ప్రాణాలు పోకుండా చూడాలన్నారు. జిల్లా కార్యదర్శి సైదమ్మ, కాశి, కిరణ్, ఇమ్మాన్యుయెల్, భారత్, వినయ్, రాజయ్య, హరీష్, మురళి, సందీప్ పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయం దేవాలయం లాంటిది: ఎమ్మెల్యే



లక్ష్మీపురం గ్రామపంచాయతీ కార్యాలయం ప్రారంభించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో నాయకులు, గ్రామస్థులు

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారాలు, గ్రామస్థులకు వసతులు సమకూర్చడం లాంటి కార్యక్రమాలు నిర్వహించే గ్రామపంచాయతీ కార్యాలయం గ్రామానికి దేవాలయం లాంటిదని శాసనసభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ రూ.20లక్షల నిధులతో నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్‌తో కలసి ఆయన సోమవారం ప్రారంభించి మాట్లాడారు. అధికారులు గ్రామస్థులకు అందుబాటులో ఉండి సహకరించాలన్నారు.

పదవిని బీసీలకు కేటాయించండి.. మిర్యాలగూడ పట్టణం: మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవిని బీసీలకు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బీఎల్ఆర్‌కు వినతిపత్రం అందించి మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి బీసీలకు ఒక్కసారి కూడా అవకాశం రాలేదని.. ఈ దఫా జనరల్ మహిళకు రిజర్వ్ అయినందున బీసీలకు అవకాశం కల్పించాలని కోరారు. వెంకటేశ్వర్లు, లింగయ్య పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి



ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్‌కు వినతిపత్రం రూపంలో అందజేశారు. తొమ్మిది దరఖాస్తులు రాగా వాటిని ఆయా మండలాలకు పంపారు.

నాగార్జునసాగర్: తన ఇంటిని మున్సిపల్ అధికారులు అన్యాయంగా కూల్చారని తనకు న్యాయం చేయాలని పైలాన్‌కు చెందిన లక్ష్మణ్‌నాయక్ ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ తన కుటుంబసభ్యులతో పైలాన్ బైపాస్‌లో ఇటీవల ఇంటికి రేకులు వేయడానికి గోడల నిర్మాణం చేస్తుండగా నందికొండ మున్సిపల్ అధికారులు వచ్చి ఎటువంటి నోటీసు లేకుండా కూల్చి వేశారని తన న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసినట్లు తెలిపారు. నందికొండ మున్సిపల్ కౌన్సిలర్ రమేష్‌జీ పైలాన్‌లోని బస్తీ దవాఖానను వెంటనే ప్రారంభించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో దరఖాస్తు చేశారు.

కొండమల్లేపల్లి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో ప్రజల నుంచి ఒకేఒక్క దరఖాస్తు అందినట్లు ఎంపీడీవో బాలరాజురెడ్డి తెలిపారు. ఆశయం మంచిదే అయినా ప్రజల నుంచి స్పందన రావడం లేదని అధికారులు వాపోతున్నారు.

వేములపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రజలు అంటూవ్యాధుల బారిన పడకుండా అధికారుల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో శారదాదేవి, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, డిప్యూటీ తహసీల్దార్ కోటేశ్వరి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

డి-25మేజర్లో పూడికతీత పనులు



డి-25లో పూడికతీస్తున్న పొక్లెయిన్

గుర్రంపోడు, న్యూస్‌టుడే: ఏఎమ్మార్పీలో 20వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీటిని అందించే డి-25 మేజరుకాల్వలో పూడికతీత పనులు ప్రారంభించారు. ఓ పక్క రైతుల పంటభూములకు నీటిని వదులుతున్నప్పటికీ అవి చివరివరకూ వెళ్లని నేపథ్యంలో మరమ్మతులు తప్పనిసరయ్యాయి. రైతులకు సాగునీరు చివరివరకూ రాకపోవటంతో పలుమార్లు అధికారులను కలిసినా ప్రయోజనం కనిపించకపోవటంతో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డిని కలిసి పరిస్థితిని వివరించారు. ప్రస్తుతం నిధులు కేటాయించలేదన్న సమాధానం రావటంతో గుత్తేదార్లకు సూచించి పనులు ప్రారంభించాలని కోరారు. ఈ నేపథ్యంలో సోమవారం డి-25లో పూడికతీత పనులు ప్రారంభించి చురుకుగా నిర్వహిస్తున్నారు.

అనుచిత వ్యాఖ్యలపై నిరసన

దేవరకొండ, న్యూస్‌టుడే: ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు ఆరాధించే మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ దేవరకొండలో సోమవారం ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. దేవరకొండ ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి శాంతి ర్యాలీ నిర్వహించారు. ముఫ్తి మహ్మద్ జావిద్ హుస్సేన్, సయ్యద్ అజీమొద్దీన్, ముఫ్తి రిజ్వాన్, ఎం.డి.ఇలియాస్‌పటేల్, ఫారుఖ్‌మౌలానా, నజీర్ మౌలానా, మొయినుద్దీన్, ఖదీర్, ఎం.డి.సలీం పాల్గొన్నారు.



అడవిదేవులపల్లిలో...



కొండమల్లేపల్లిలో...



చింతపల్లి మండలం వెంకటేశ్వరనగర్‌లో ఎమ్మెల్యే బాలునాయక్



వెంకటేశ్వరనగర్‌లో ప్రమాణ స్వీకారానికి ముందు పూజలు చేస్తున్న ఛైర్మన్ దొంతం అలివేలు

ప్రత్యేక పూజలు.. అన్నదానాలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ నియోజకవర్గాల్లో సోమవారం పలు ఆలయాలు, మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు మండపాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మిర్యాలగూడ అశోక్‌నగర్‌లోని మండపం వద్ద అభ్యాస్ విద్యా సంస్థల అధినేత వంగాల నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బీఎల్ఆర్, పుర అధ్యక్షుడు తిరునగరు భార్గవ్ ప్రారంభించారు. అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని మహిషాసురమర్దని ఆలయంలో కనకదుర్గ అమ్మవారు శ్రీ సంతాన లక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరనగర్‌లోని ప్రతిష్ఠించిన దుర్గామాత వద్ద ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- న్యూస్‌టుడే, బృందం



దేవరకొండ బస్‌స్టేషన్ నుంచి బతుకమ్మలను తీసుకువస్తున్న మహిళా ఉద్యోగులు

ఘనంగా బతుకమ్మ సంబరాలు

దేవరకొండ, న్యూస్‌టుడే: దేవరకొండ ఆర్టీసీ బస్‌డిపో ఆధ్వర్యంలో సోమవారం మహిళా ఉద్యోగులు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీఎం తల్లాడ రమేష్‌బాబు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు తెలియజేయాలన్నారు.

ట్యూషన్లు చెబుతూ... చోరీలు చేస్తూ..

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: మహిళల గొలుసులు దొంగతనం చేసిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం ఇబ్రహీంపట్నం ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ రాజు, సీఐ సత్యనారాయణ, ఎస్ఐ నాగరాజుతో కలిసి దొంగతనం వివరాలను వెల్లడించారు. నల్గొండ జిల్లా వద్దిపట్ల గ్రామానికి చెందిన బొంత అనీల్.. నగరంలోని శాలిబండలో నివాసం ఉంటున్నాడు. స్కూల్, కళాశాల విద్యార్థులకు ట్యూషన్లు చెబుతుంటాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడ్డాడు. అప్పులు చేసి వాటిని తీర్చడానికి దొంగతనాలు చేస్తున్నాడు. గత నెల 17 పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అవుటర్ సర్వీసురోడ్డు వద్ద ఓ మహిళ మెడలో 4 తులాల బంగారు గొలుసు, ఈనెల 4న ఇబ్రహీంపట్నం సమీపంలోని శేరిగూడ గ్రామానికి చెందిన మొద్దు భారతమ్మ మెడలోని 3 తులాల బంగారు గొలుసు చోరీ చేశారు. ఎస్ఐ నాగరాజు, క్రైం పోలీసులు నిందితుడు అనీల్‌ను గుర్తించి 7 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్‌కు తరలించారు.



మిర్యాలగూడ డాక్టర్స్ కాలనీలో రోడ్డుకు అడ్డంగా నిలిపిన ద్విచక్ర వాహనాలు

ట్రాఫిక్ చక్రవ్యూహంలో డాక్టర్స్ కాలనీ

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: అసలే ఇరుకు రోడ్లు.. ఆపై నిత్యం ప్రజల రద్దీ.. మరోవైపు రోడ్డుకు ఇరువైపులా నిలుపుతున్న ద్విచక్ర వాహనాలు. వెరసి కాలినడకన సైతం వెళ్లలేని దుస్థితి. ఇదీ మిర్యాలగూడలోని డాక్టర్స్ కాలనీలో ఎదురయ్యే పరిస్థితి. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే డాక్టర్స్ కాలనీలో వాహనాలను రోడ్డుపైనే నిలుపుతుండడంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయి.. అత్యవసర సమయంలో అంబులెన్సులు, ఇతర వాహనాలు రాకపోకలు సాగించేందుకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పోలీసులు తక్షణమే స్పందించి డాక్టర్స్ కాలనీలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ప్రత్యేక సిబ్బందిని నియమించి డాక్టర్స్ కాలనీలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తామని ట్రాఫిక్ ఎస్సై బండి మోహన్ తెలిపారు.

సినిమాలు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే

రాఘవ: దేవర, **వెంకటేశ్వర:** దేవర, **శ్రీనివాస:** శ్వాగ్

విట్రోస్: మత్తు వదలరా-2, దేవర, సత్యం సుందరం, శ్వాగ్

ముందస్తు ప్రణాళికలు చేసుకోండి

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలుపై ఆయా కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా తగిన ప్రణాళికలు చేసుకోవాలని మండల అభివృద్ధి అధికారి శేషగిరి శర్మ, మండల వ్యవసాయాధికారి సైదానాయక్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని రైతువేదికలో మండల సమాఖ్య, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహణ అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ వానాకాలం ధాన్యం కొనుగోలు చేపట్టాలని ప్రభుత్వ ఆలోచన ప్రకారం మండలంలో 7 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఏఈవోలు షఫీ, రమేష్, బిందు, గోపి, ఆఫ్రిన్, వెలుగు తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

గుర్రంపోడు, న్యూస్‌టుడే: గ్రామావసరాల నిమిత్తం ఉంచిన రెండెకరాల అసైన్‌మెంట్ భూమిని దాని పక్క పట్టాభూమి యజమాని ఆక్రమించుకున్నాడని గుర్రంపోడు మండలం కొనాయిగూడెం గ్రామస్థులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం గుర్రంపోడు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గ్రామపరిధిలోని 1138, 1136 సర్వేనంబర్లకు చెందిన రెండెకరాల భూమిని బ్రాహ్మణగూడెం గ్రామానికి చెందిన కట్టెబోయిన విజయ్ అతని కుటుంబసభ్యులు ఆక్రమించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మినీట్యాంక్ బండ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

నిడమనూరు, న్యూస్‌టుడే: నిడమనూరులో మినీట్యాంక్‌బండ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, ఐబీ ఎస్ఈ శ్రీధర్‌రావు అన్నారు. సోమవారం నిడమనూరులో నల్లచౌట చెరువును ఆయన పరిశీలించారు. బండ్ పనులతో పాటు చెరువు మీదకి వెళ్లడానికి సరైన దారి లేదని, స్థానిక కాంగ్రెస్ నాయకులు కొందరు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. చెరువు పూర్తిగా నిండి అలుగు పోసి గతంలో రెండుసార్లు చుట్టుపక్కల ఇళ్లలోకి నీరు చేరి స్థానికులు ఇబ్బందులు పడిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈఈ కర్ణాకర్, డీఈఈ శ్రీనివాస్, జేఈఈలు జగపతి, ప్రవీణ్, గుత్తేదారు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు సేవ చేసేందుకే మార్కెట్ కమిటీలు



చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరనగర్‌లో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

చింతపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని మాల్ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులకు సేవ చేసేందుకే మార్కెట్ కమిటీలు పని చేస్తున్నాయని అన్నారు. మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల్లో రూ.2.50కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ వసతి గృహాలను నిర్మించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, మాజీ ఎమ్మెల్యేలు ఉజ్జిని యాదగిరిరావు, పల్లా వెంకట్‌రెడ్డి, మాల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దొంతం అలివేలు, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, డీసీసీ ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి, మండల అధ్యక్షుడు నాగభూషణం పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

దేవరకొండ: మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. దేవరకొండలో సోమవారం ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమానికి దేవరకొండ, నాగార్జునసాగర్ ఎమ్మెల్యేలు నేనావత్ బాలునాయక్, కుందూరు జైవీర్‌రెడ్డిలతో కలిసి హాజరై ఇందిరా ఫెలోషిప్, శక్తి అభియాన్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఇందిరా ఫెలోషిప్ సభ్యులను ఆయన అభినందించారు. మార్కెట్ ఛైర్మన్ నాయిని జమున, ఎమ్మెల్యే బాలునాయక్ సతీమణి జ్యోతిప్రసన్న, ధనలక్ష్మి, గౌతమి, మన్మథరెడ్డి, శ్రీలతరెడ్డి, తదితరులున్నారు.


జనహృదయనేతకు
జన్మదిన శుభాకాంక్షలు
నిరాడంబరులు, స్నేహశీలి,
అనునిత్యం ప్రజలతో మమేకమయ్యే
నాయకులు, నాగార్జున సాగర్ MLA
శ్రీ కుందూరు జయవీర్‌రెడ్డి గారికి
మా హృదయపూర్వక
జన్మదిన శుభాకాంక్షలు..
ఇలాంటి పుట్టినరోజు వేడుకలు
మీరు మరెన్నో జరుపుకోవాలని
మనసారా కోరుకుంటూ.....
మీ..
Happy
Birthday
ANNA
మిట్టపల్లి వెంకటేష్